0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com

విశాఖ సమాచారం

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 58 విశాఖపట్నం, 07 డిశంబరు 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

సెయిల్ సీఎండీతో జీవీఎల్ సమావేశం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌గా ప్రసిద్ధి చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్) సహాయం కోసం తన నిరంతర ప్రయత్నాలను కొనసాగిస్తూన్న, బిజెపి రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ అమరేందు ప్రకాష్‌తో సమావేశమయ్యారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్‌తో విలీనం చేసే అవకాశం పై ఇంకా ఆర్‌ఐఎన్‌ఎల్ యొక్క ఆర్థిక పనితీరును మెరుగుపరచేందుకు ఉత్పత్తిని పెంచడానికి మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఆపరేట్ చేయడానికి సెయిల్ నుండి సహాయం కోరారు.

రెండు వారాల క్రితం, ఆర్‌ఐఎన్‌ఎల్ ఎగ్జిక్యూటివ్ మరియు ఉద్యోగుల సంఘాలు బీజేపీ ఎంపీ జీవీఎల్‌ను కలుసుకుని, ఆర్‌ఐఎన్‌ఎల్‌ని సెయిల్‌తో విలీనం చేయాలని లేదా ఆర్‌ఐఎన్‌ఎల్ యొక్క మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఆపరేట్ చేయడానికి సెయిల్ నుండి సహాయం అందే విధంగా ఆయన ప్రయత్నించాలని అభ్యర్థించడం అందరికీ తెలిసిందే.

ఈ నేపథ్యంలో సెయిల్ సీఎండీతో ఎంపీ జీవీఎల్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఈ సమస్యలను కేంద్ర ఉక్కు, బొగ్గు, ఆర్థిక శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కోల్ ఇండియా మొదలైన పిఎస్‌యుల ద్వారా ముడిసరుకు సరఫరా, వర్కింగ్ క్యాపిటల్ అందజేయడం వంటి విషయాలపై చర్యల ద్వారా గత రెండేళ్లుగా స్టీల్ ప్లాంట్‌కు సహకరిస్తున్నట్లు తెలియజేశారు.

సెయిల్‌తో విశాఖ స్టీల్ ప్లాంట్ విలీనం రెండు సంస్థలకి గొప్ప విజయం వంటిదని జీవీఎల్ వ్యాఖ్యానించారు.

19,650 ఎకరాల ల్యాండ్ బ్యాంక్ కలిగి, రెండు పోర్టులు కలిగి ఉండటం ఆర్‌ఐఎన్‌ఎల్ యొక్క గొప్ప సొలభ్యం అని జీవీఎల్ సెయిల్ సిఎండికి తెలియజేశారు.

ప్రస్తుతం, సెయిల్ ల్యాండింగ్ పోర్ట్‌ల నుండి చాలా దూరంలో ఉన్న తన ప్లాంట్‌లకు ముడి పదార్థాలను రవాణా చేస్తుందనీ మరియు దక్షిణ మరియు పశ్చిమ రాష్ట్రాలలోని మార్కెట్‌లకు సుదూర ప్లాంట్ల నుండి తుది ఉత్పత్తులను రవాణా చేస్తుందనీ, సెయిల్‌తో ఆర్‌ఐఎన్‌ఎల్‌ని విలీనం చేయడం ద్వారా ఈ అదనపు లాజిస్టిక్స్ ధరను నివారించవచ్చనీ జీవీఎల్ తెలియజేస్తూ ఈ విలీనం ఆర్‌ఐఎన్‌ఎల్‌కి బాగా సహాయం చేస్తుందనీ, మరియు సెయిల్ యొక్క క్యాప్టివ్ ఇనుప ఖనిజం మరియు బొగ్గు గనుల నుండి ముడి పదార్థాలను పొందడం ద్వారా దాని ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంలో సహాయపడుతుందనీ అన్నారు.

సెయిల్‌తో ఆర్‌ఐఎన్‌ఎల్ యొక్క సంభావ్య విలీన అంశ విషయంలో సెయిల్ చీఫ్ యొక్క అభిప్రాయాలను ఈ సమావేశంలో జీవీఎల్ అడిగి తెలుసుకున్నారు.

సెయిల్ సీఎండీని కలిసిన అనంతరం ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఓ ప్రకటనలో

(మిగతా 2లో)

మిచౌంగ్ తుఫాను బాధిత రైతులకు జగన్ భరోసా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టం అంచనాలు తదితర అంశాలపై సీఎం జగన్ వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో సాధారణ స్థితి తీసుకురావడానికి అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, ఆ పరిస్థితులలో మనమే ఉంటే ఎలాంటి సహాయాన్ని ఆశిస్తామో ఆ తరహా సహాయాన్ని బాధితులకు అందించాలన్నారు. పది రూపాయలు ఎక్కువ ఖర్చయినా పర్వాలేదు కానీ బాధితులకు మంచి సహాయం అందాలని, ఇలాంటి కష్ట సమయంలో తమను బాగా చూసుకున్నారు అనే మాట రావాలని జగన్ పేర్కొన్నారు.

ఇక రైతుల పంట నష్టాన్ని అంచనా వేయాలని, పొలాలలో పరద సీటిని పూర్తిగా తొలగించడం పై దృష్టి సారించాలని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు అధైర్య పడాల్సిన

(మిగతా 2లో)

తెలంగాణ నూతన సీఎం ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు

హైదరాబాద్: తెలంగాణ నూతన సీఎం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు పరిశీలించారు. చేస్తున్న ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై డీజీపీ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను సీఎస్ అడిగి తెలుసుకున్నారు.

మరోవైపు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లపై ఎల్బీ స్టేడియంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నేతలతో

(మిగతా 2లో)

జడ్జిలను దూషించిన కేసులో హైకోర్టు విచారణ

మరోసారి నోటీసులు జారీకి ఆదేశం

తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో న్యాయమూర్తులను దూషించిన కేసును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీరియస్‌గా తీసుకుంది. జడ్జిలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటుంది హైకోర్ట్. ఈ క్రమంలోనే మరి కొందరికి నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.

టీడీపీ అధ్యక్షుడు చంద్ర బాబు అరెస్ట్ తరువాత న్యాయమూర్తులను దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కేసులో దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

ఈ కేసులో ఇప్పటికే 26 మందిని గుర్తించి నోటీసులు పంపారు. గుర్తించిన మరి కొందరికి నోటీసులు పంపాలని న్యాయస్థానం ఆదేశించింది.

ఈ కేసులో టీడీపీ నేతలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బుద్ధా వెంకన్నతో పాటు ఫేస్ బుక్, ట్విట్టర్, గూగుల్‌కు నోటీసులు పంపారు. జడ్జీలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్లు, వ్యక్తిగత దూషణలకు దిగిన వారిలో మరి కొందరిని గుర్తించామని వారికి త్వరలో నోటీసులు ఇస్తామని ప్రభుత్వ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. కొందరి అడ్రసులు ట్రేస్ అవ్వలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ పేర్లు మార్చిన నేపథ్యంలో వారికి మరోసారి నోటీసులు సర్వ్ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

సిఓసిలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జివిఎంసి కమిషనర్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మిచౌంగ్ తుఫాన్ కారణంగా నగరంలో జరిగే అవాంచనీయ సంఘటనలను తెలుసుకునేందుకు జివిఎంసి నందు సిటీ ఆపరేషన్ సెంటర్‌ను జివిఎంసి కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ బుధవారం ఉదయం పరిశీలించారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయం సిటీ ఆపరేషన్ సెంటర్(సి.ఓ.సి) నందు నగరంలో గల రైల్వే స్టేషన్, కొబ్బరి తోట, డాల్ఫిన్ జంక్షన్, ఫిషింగ్ హార్బర్, కన్వెంట్ జంక్షన్, హనుమంతువాక, గోపాలపట్నం, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్ తదితర ప్రదేశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్

(మిగతా 2లో)

ఏపీ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు

ఈనెల 22, 23న రాష్ట్రంలో టూర్

ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతో ఏపీతో పాటు వచ్చే ఏడాది పెండింగ్ లో ఉన్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలకు ఈసీ రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఏపీలో ఈ నెలలో రెండు రోజుల పాటు పర్యటించబోతోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియపై భారీ ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈసీ టూర్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రంలో ఈసీ టూర్ ఖరారైంది.

ఏపీలో ప్రస్తుతం ఓటర్ల తుది జాబితా తయారవుతోంది. జనవరి 5 నాటికి ఈ తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించబోతోంది. అంతకంటే ముందే ఈసీ బృందం రాష్ట్రంలో పర్యటించబోతోంది. రాష్ట్రంలో భారీ ఎత్తున ప్రతిపక్షాల ఓట్లు తొలగింపు జరుగుతోందన్న ఫిర్యాదులు, అదే సమయంలో అధికార వైసీపీ కూడా ఓట్లు తొలగింపుతో పాటు తెలంగాణలో ఓటు వేసిన వారు తిరిగి ఇక్కడ ఓటు వేయకుండా అడ్డుకోవాలని కోరుతున్న నేపథ్యంలో ఈసీ టూర్ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇప్పటికే వైసీపీ, టీడీపీ నేతలు రాష్ట్రంలో ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు భారీ ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై ఆయన తీసుకుంటున్న చర్యలపైనా విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఈసీ ఆదేశాలను

(మిగతా 2లో)

ఐదోసారి.. ఫోర్బ్ శక్తిమంతుల జాబితాలో నిర్మలా సీతారామన్

ఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. 2023 ఏడాదికి ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో ఆమెకు వరుసగా ఐదోసారి చోటు లభించింది. భారత్ నుంచి మొత్తం నలుగురు మహిళలకు చోటు దక్కగా వారిలో నిర్మలా సీతారామన్ తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్త జాబితాలో ఆమె 32వ స్థానంలో ఉన్నారు. గతేడాది 36వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. నిర్మలా సీతారామన్ తర్వాత భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా (60వ స్థానం), స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్ సోమా మొండల్ (70వ స్థానం), బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా (76వ స్థానం)లకు వరుసగా ఈ ఏడాది కూడా జాబితాలో చోటు దక్కింది.

ప్రపంచవ్యాప్తంగా శక్తిమంతమైన మహిళల జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ తొలి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, మూడో స్థానంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఉన్నారు. నాలుగో స్థానంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఐదులో అమెరికా గాయని బేలర్ స్విఫ్ట్ చోటు దక్కించుకున్నారు.

భారత్‌లో తొలి, పూర్తి స్థాయి ఆర్థిక మంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆర్థిక శాఖతో పాటు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. జాతీయ మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా ఉన్నారు.

హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ కుమార్తె రోష్ని నాడార్ మల్హోత్రా. జులై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. గతేడాది ఈ జాబితాలో ఆమె 53 స్థానంలో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ అధ్యర్యంలోని సెయిల్‌కి తొలి మహిళా ఛైర్‌పర్సన్‌గా సోమా మొండల్ 2021లో బాధ్యతలు చేపట్టారు. సెయిల్

(మిగతా 2లో)

తాగి వాహనం నడిపితే ఇదే శిక్ష..!

121 మందికి కమ్యూనిటీ సర్వీస్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మద్యం మత్తులో వాహనం నడుపుతూ ఇతరులకు హాని కలిగించే వారు తస్మాత్ జాగ్రత్త..! పీకల దాకా తాగేసి తమను తాము నియంత్రించుకోలేని స్థితిలో వాహనాలను రోడ్లపై పరుగులు పెట్టించేవారు ఇకపై బీ అలర్ట్..! మీలోని కిక్కు పదిలే పనిష్మెంట్ కు సిద్ధం కావాల్సిందే. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే.. కమ్యూ నిటీ సేవ చేయాల్సిందే..! తాజాగా డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన 121 మందికి విశాఖ భీమిలి కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఏంటా శిక్ష..? అదేలా ఉంటుందనే కదా మీ సందేహం..అయితే, పూర్తి స్టోరీలోకి వెళ్లాల్సిందే..

విశాఖ జిల్లా భీమిలిలో ఉన్న కోకోనట్ పార్కులో కొంతమంది హడావిడిగా కనిపించారు. పరిసరాలు శుభ్రపరుస్తూ కనిపించారు. అది కూడా అంకిత భావంతో. అలాగే సెయింట్ ఆన్స్ స్కూల్ లోను చెత్తను త్వర త్వరగా క్లీన్ చేసేస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసరాలను కూడా..! ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 100 మందికి పైనే ఉన్నారు. అలా అని వాళ్ళు ఏదో సేవా భావంతో చేయడం లేదు. తప్ప తాగి వాహనం నడుపుతూ రోడ్లపైకి వచ్చి పట్టుబడిన వారికి.. కమ్యూనిటీ సర్వీస్ కింద భీమలి కోర్టు శిక్ష ఖరారు చేసింది. కోర్టు ఆదేశాలతో బుద్ధిగా తన పనిలో పడ్డారు ఆ డ్రంక్ అండ్ డ్రైవర్లు.

విశాఖలో అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, సీపీ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాలతో విస్తృతంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో చాలా

(మిగతా 2లో)

తడిసిపోయిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): భారీ తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా, మండల యంత్రాంగాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేసి, అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకున్నారని ఆయన వెల్లడించారు. తారువలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం నిరంతరం అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ, తుఫాను ప్రభావాన్ని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తీరప్రాంతంలో హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా, ఎటువంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాలను సిద్ధంగా ఉంచారని తెలిపారు. మాడుగుల నియోజకవర్గం నాలుగు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఫోన్ ద్వారా ప్రస్తుత పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. వాతావరణ శాఖ సూచనలను బట్టి అయితే భారీ వర్షాలు పడవచ్చన్న సూచనలు మాత్రం ఉన్నాయని, కోతకొచ్చిన పరిపంట నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. తడిచిపోయిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్లో అయినా కొనుగోలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

వేర్శాగికి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

చోడవరం, (విశాఖ సమాచారమ్): తుఫానుకు వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని చోడవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు డిమాండ్ చేశారు. బుచ్చయ్యపేట మండలంలోని బంగారు మెట్ట గ్రామంలో తడిసిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అరుగాలం కష్టించి పండించిన పంట వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని కోరారు.

తుఫాన్ నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే



చోడవరం, (విశాఖ సమాచారమ్): చోడవరం నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. చిన్నపిల్లలు బయటకు వెళ్ళనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు.

హోం గార్డుల సేవలు అభినందనీయం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): హోమ్ గార్డుల 61వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనకాపల్ల పట్టణం, పెంటకోట కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కేపీ మురళీకృష్ణ ముఖ్య అతిథి గా విచ్చేసి హోమ్ గార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 1962 సంవత్సరం లో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా హోమ్ గార్డులు అంతర్గత భద్రత, ప్రకృతి విపత్తులు తదితర అత్యవసర సమయాల్లో పోలీసులకు సహకరించేందుకు హోమ్ గార్డుల వాలంటరీ వ్యవస్థగా ఏర్పాటు చేశారన్నారు.

ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హోమ్ గార్డుల ప్రాధాన్యతను, పోలీసు శాఖకు వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది డిశంబర్ 06 వ తేదీన "హోమ్ గార్డ్ రైజింగ్ డే' నిర్వహించడం ఆనవాయితీ గా వస్తోందన్నారు.

హోంగార్డులు విధినిర్వహణలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైమ్ తదితర విధుల్లో కానిస్టేబుల్ తో సమానంగా ప్రశంసాపూర్వకంగా పనిచేస్తూ పోలీస్ శాఖలో ముఖ్య భూమిక నిర్వహిస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, నాటుసారా, లా అండ్ ఆర్డర్ కేసులు, చోరీ కేసులో నింతులు పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన 6గురు హోంగార్డులు అర్.రాంబాబు, బాబా షేక్ ముస్సిన్ మదీనా, పి.ఈశ్వరరావు, ఎన్.పైడం నాయుడు, బి.త్రినాథ రావు మరియు ఎస్.సన్నిబాబులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలతో సత్కరించారు. హోంగార్డు లకు ఎటువంటి సమస్యలున్న నేరుగా కలవాలని తెలిపారు.విధి నిర్వహణలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో మరణించిన హోంగార్డ్ కుటుంబాలకు రావలసిన అన్ని బెనిఫిట్స్ అందేలా తగు చర్య తీసుకోవడం జరిగిందన్నారు. వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి హోంగార్డ్ ఉద్యోగం ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ సం.,14 మందికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్.జలు సతీష్, రామకృష్ణారావు, వెంకట్రావు మరియు కోటేశ్వరబాబు, అనకాపల్లి టౌన్ సిఐ మోహన్ రావు, ఎస్సైలు సింహాచలం, సత్యనారాయణ, ఆదినారాయణ ఇతర అధికారులు మరియు హోమ్ గార్డులు పాల్గొన్నారు.

అంబెడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి , జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

పాడేరు, (విశాఖ సమాచారమ్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి రాజ్యాంగ నిర్మాతకు పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర ఘనంగా నివాళులర్పించారు. పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అంబేద్కర్ గారి చిత్రపటానికి ఇరువురు నేతలు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తరహా పాలన సాగిస్తుందని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే అందరిలో సమన్యాయం ఏర్పడుతుందనే నడుద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలు రూపంలో ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వామ్యం చేయడంలోనే బడుగు బలహీనులకు అగ్ర తాంబూలం ఇచ్చినటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి గారు అన్నారు. కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలు లేని సమాజ నిర్మాణమే ఆయన అంబేద్కర్ ధ్యేయమని జగన్మోహన్ రెడ్డి కూడా సంక్షేమ పథకాల అమలులో కులాలు, మతాలు ప్రాంతాలు, రాజకీయాలకతీతంగా అర్హత ఒకటే ప్రామాణికంగా అమలు చేస్తున్నారని చెప్పారు. భారతదేశంలోని ఆనాడు స్వేచ్ఛ స్వాతంత్రాల కోసం కోసం ఏదైతే పోరాటం చేశారో ఆ నాయకులు, ఆ నేతల ఆశయాలకు అనుగుణంగా నేడు జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని యువతకు పిలుపునిచ్చారు సోషల్ మీడియా ఇన్ఫ్లుఎన్సర్ అళ్ల నగేష్, లకే శ్రీను, సాయి, కృష్ణమూర్తి, పిదంబరం తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): మిగ్ జాం తుఫాను కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు యలమంచిలి మండలంలో రైతన్నలు అతలాకుతలమైన సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారులతో కలిసి ఎమ్మార్వో ఎస్.రాజేఅమ్మాజి, మండల ప్రత్యేక అధికారి చాముండేశ్వరినాథ్,ఎంపీపీ బోడెపల్లి గోవింద్ బుధవారం నాడు మేజర్ పంచాయతీ ఏటికొప్పాక, పులపర్తి,పి.ఎన్.ఆర్. పేట,బయ్యవరం గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేసి పిట ముంగిన పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మండలంలో మొత్తం వరి సాగు విస్తీర్ణం 2204హెక్టార్లు ఉండిన అందులో 212 హెక్టార్లలో పంట పిట ముంగిందని,652 హెక్టార్లలో నేలకొరిగినట్లు వ్యవసాయాధికారి మోహన్ రావు తెలిపారు. అనంతరం ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ పంట నష్టం జరిగిన ప్రతి రైతును గుర్తించవలసిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులు,సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ లపై ఉందన్నారు. మండలంలో మిగ్ జామ్ తుఫాను వలన నష్ట పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చేలా మండల అధికారులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అచ్చలనాయుడు,సచివాలయ సిబ్బంది,వైసీపీ నాయకులు సేనాపతి రాము, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

తుఫానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎంపీపీ

డా.బి.ఆర్ అంబెడ్కర్ కి బీజేపీ నేతలు వర్ధంతి సందర్భంగా పాలాభిషేకం ఘన నివాళులు



పాడేరు, (విశాఖ సమాచారమ్): భారత రాజ్యాంగ నిర్మాత డా. బి .ఆర్ అంబేద్కర్ ఆశయాలు కోసం ప్రతి కృషి చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు ,బుధవారం పాడేరులో అంబెద్కర్ సెంటర్ లో డా.,బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నేతలు అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పొంగి రాజారావు,బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ సెనుమాళ, బీజేపీ మండల అధ్యక్షుడు రవి చంద్ర, బీజేపీ నాయకులు డా, హేమా నాయక్,పాపిటి రాజు కాకర చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం

గురువారం 07-12-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయనం శరదృతువు
కార్తీక మాసం

తిథి : బ. దశమి రా. 02.33
నక్షత్రం : హస్త పూర్తి
వర్జ్యం : ప. 01.52 ల 03.36

డిసెంబరు 8 నుండి అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను జయప్రదం చేయండి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రరాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల డిసెంబరు 8వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తున్నాము. ఈ సమ్మెలో అంగన్‌వాడీ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరుతున్నాము. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతామని, పని భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. కానీ రోజు రోజుకి అంగన్‌వాడీలపై వేధింపులు, పనిభారం పెరుగుతుంది. రకాల రకాల యాపిల పేరుతో 24 గంటలు పనిచేయించుకుంటున్నారు. తక్షణమే యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్ బడ్జెట్‌లో నిధులను క్రమంగా తగ్గిస్తువేస్తోంది. పిల్లలు, గర్భిణీలు, మెరుగైన సేవలు అందించేందుకు మాతా శిశు మరణాలను తగ్గించేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచవలసినది పోయి తగ్గించడం అన్యాయం. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగానే బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారు. ఐసిడిఎస్‌ను రక్షించుకోవడం మన అందరి బాధ్యత.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, మిని సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లగా మార్చాలని, వర్కర్‌తో సమానంగా వేతనాలు చెల్లించాలని ప్రమోషన్లలో రాజకీయ జోక్యం ఆపాలని, బకాయిపడ్డ టి ఎ బిల్లులను, ఇంటి అద్దెలను చెల్లించాలని, 62సం।రాలకు రిటైర్‌మెంట్ వయస్సును పెంచాలని, చనిపోయిన వారికి 10లక్షలు రూ.లు చెల్లించాలని వారి కుటుంబ మరిఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఉద్యమాలపై నిర్బంధాలను ఆపాలని కోరుతూ జరుగుతున్న సమ్మె జరుగుతుంది.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మా డిమాండ్‌లను పరిష్కరించలేని యెడల ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తాము, ఈ సమ్మెకు లబ్ధిదారులు, ప్రజలు, మేధావులు, అభ్యుదయవాదులు అందరూ సంఘీభావం తెల్పవలసినదిగా కోరుతున్నాము.

(మొదటి పేజీ తరువాయిలు)

మిచౌంగ్ తుఫాను బాధిత రైతులకు జగన్ భరోసా

అవసరం లేదని సీఎం జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పంటల రక్షణ కోసం, తడిసిన ధాన్యాన్ని రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు సబ్సిడీపై విత్తనాల సరఫరా కు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలలో రవాణా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరించాలని సూచించారు.

ఇక వర్షాలు పరదల వల్ల నిరాశ్రయులైన వారు క్యాంపుల నుండి తిరిగి ఇండ్లకు వెళుతున్నవారికి తగిన సహాయం అందించాలని సూచించారు. పరిహారం అందించడం పట్ల సానుభూతితో వ్యవహరించాలని, రేషన్ పంపిణీలో కూడా ఎలాంటి లోపం ఉండకూడదని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పై దృష్టి సారించాలన్నారు.

అధికారులు బాగానే పనిచేస్తున్నారని పేర్కొన్న సీఎం జగన్మోహన్ రెడ్డి చెట్టు కూలి కానిస్టేబుల్ చనిపోయిన ఘటనలో ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడుతుందని, 30 లక్షల రూపాయల సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులలోను ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ప్రభుత్వం అండగా ఉంటుందని సూచించారు.

సెయిల్ సీఎండీతో జీవీఎల్ సమావేశం

మాట్లాడుతూ, "ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగులు, కార్మికులు అందోళనలు చేసినా తాను తప్ప వైసీపీ, టీడీపీ ఎంపీలు ఎవరూ పట్టించుకోలేదనీ, పార్లమెంటు లోపలగానీ, బయటగానీ అన్ని అంశాలను తానే ప్రశ్నిస్తున్నానని, విశాఖ ఉక్కు ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం తాను కృషి చేస్తాననీ కార్మికులకు మరియు ఎగ్జిక్యూటివ్లకు హామీనిస్తున్నారు.

తెలంగాణ నూతన సీఎం ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు

పోలీసు, సాధారణ పరిపాలన శాఖ అధికారులు చర్చించారు. సీఎల్పీ నేతగా ఎంపికైన రేవంత్ రెడ్డి గురువారం రాష్ట్ర నూతన సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే.

సిఓసిలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జివిఎంసి కమిషనర్

సి.ఓ.సి సిబ్బందితో మాట్లాడుతూ, మిచౌంగ్ తుఫాన్ కారణంగా విశాఖ నగరంలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున రోడ్డపై, పలు కూడళ్ళలో చెట్లు విరిగపడటం వలన అడ్డంకులు, కాలువలలో, గెడ్డలలో వర్షాలు చేరి వర్షపు నీరు నిల్వలు వంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తే అవకాశం ఉన్నందున నిరంతరం కెమెరాల ద్వారా పరిశీలించి ఎప్పటికప్పుడు అధికారిక వాట్సాప్ గ్రూపులో అధికారులకు సమాచారాన్ని తెలియజేయాలని సిఓసి సిబ్బందిని ఆదేశించారు. వర్షం కారణంగా తలెత్తుతున్న సమస్యలపై నగర ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతం, కొండవాలు ప్రాంత ప్రజలు సిఓసి కి అందించే ఫిర్యాదులను వెంటవెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని వారికి సూచించారు. అనంతరం కాలువలు, గెడ్డలు పొంగి పొర్లకుండా అవసరమగు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వాకీటాకీ ద్వారా సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఏపీ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు

8 జిల్లాల కలెక్టర్లు పట్టించుకోవడం లేదని, అయినా ఈసీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై రేపు విపక్ష నేత చంద్రబాబు ఢిల్లికి వెళ్లి సీఈసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 22, 23 తేదీల్లో పర్యటించనున్న కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల బృందం రాజకీయ పార్టీలతో సమావేశమై వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించబోతోంది. వీటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఏపీలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది ఏప్రిల్ లో సార్వత్రిక ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహిస్తారు.

ఐదోసారి.. ఫోర్బ్స్ శక్తిమంతుల జాబితాలో నిర్మలా సీతారామన్

ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, ఆమె వైస్‌చైర్మన్ అయ్యాక కంపెనీ లాభాలు మూడు రెట్లు పెరిగినట్లు ఫోర్బ్స్ తెలిపింది. గతేడాది ఆమె 67వ స్థానంలో నిలిచారు.

1978లో కిరణ్ మజుందార్ షా బయోకాన్‌ను నెలకొల్పారు. ఆ తర్వాతి కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరిగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహోర్‌లో ఆసియాలోనే అతి పెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది. గతేడాది 72వ స్థానంలో ఉన్నారు.

తాగి వాహనం నడిపితే ఇదే శిక్ష..!

పాయింట్లు ఎప్పటి కప్పుడు తనిఖీలు చేస్తూ కేసులు పెడుతున్నారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరుస్తున్నారు. అయితే.. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 121 మందిపై కేసులు పెట్టారు. వారిని కోర్టులో హాజరు పరిచారు. దీంతో కోర్టు వారికి.. వెయ్యి రూపాయలు జరిమానాలతో పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో .. వారందరినీ దీనిలోని కొన్ని ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రం చేశారు.

వాళ్లకు జైలు శిక్ష..223 మందికి 6.19 లక్షల జరిమానా

ఆలాగే కంచరపాలం, గోపాలపట్నం, పెందుర్తి, న్యూ పోర్టు, మల్కాపురం, ఎ మ్మూర్ పేట, త్రీ టౌన్, అనందపురం ప్రాంతాల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వ హించి వారిని న్యాయస్థానంలో హాజర పరిచారు. దీంతో కేసు తీవ్రతను బట్టి.. న్యాయస్థానం జైలు శిక్షను ఖరారు చేసింది. నలుగురికి ఎనిమిది రోజులు, 9రోజులు, 10రోజులు, 11రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఓవరాల్ గా 253 మందికి గాను జరి మానాల కూడా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది కోర్టు. 6.19 లక్షల జరిమానాలు విధించింది.

ఇటీవల కాలంలో.. విశాఖలో ఇటీవల కాలంలో మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు సంభ వించాయి. కొంతమంది ప్రాణాలకు కూడా కోల్పోయారు. మరికొంతమంది తాగి వాహనం నడిపి ఇతరులకు ప్రమాదకారంగా మారారు. పోలీసులు కేసులో నమోదు చేస్తున్నారు. కోర్టులు తీవ్రతను బట్టి జరిమానాలు, జైలు శిక్షలు విధిస్తూ ఆదేశాలు ఇస్తుంది. కొన్ని కేసుల్లో జరిమానాలు, పరిసరాలను శుభ్రం చేయడం.. రోడ్డు, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించే లా శిక్షలు కూడా వేస్తున్నారు.

వాహనాలు డ్రైవ్ చేసినప్పుడు మద్యం మత్తుకి దూరంగా ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కలిసి రావాలని కోరుతున్నారు పోలీసులు.

విశాఖ సమాచారమ్
గురువారం 07-12-2023

ధర్భల మహిమ

తులసి, ధర్భలు, బిల్వదళములు వున్న స్థలం పరమ పవిత్రమైనదిగా భావిస్తారు.

ఒక విధమైన గడ్డి జాతికి చెందిన ధర్భ మొక్కలు శ్రీ రాముని స్పర్శ చేత పునీతమై , ఆ ధర్భలను పవిత్ర కార్యాలకు వినియోగించబడుతున్నది.

ధర్భలకు ఉష్ణ శక్తి ఎక్కువ. జలాన్ని శుభ్రపరుస్తుంది. విషానికి విరుగుడు గుణం కలది. గ్రహణ కాలంలో వ్యాపించే విషక్రిమి నాశనానికి ఉప్పు కలిపిన పదార్థాలలో ధర్భలు వేసి వుంచడం గమనించవచ్చును.

ధర్భలని సంస్కృతం లో 'అగ్ని గర్భం' అంటారు. కుంభాభిషేకాలలోను యాగశాలలోని కలశాలలోను, బంగారు, వెండి తీగలతో పాటుగా ధర్భలను కూడా తీగలుగా చుట్టి ఉపయోగిస్తారు.

ధర్భలలో కూడా స్త్రీ , పురుష , నపుంసక జాతి ధర్భలని మూడు రకాలు వున్నాయి. పురుష జాతి దర్భలు అడుగు నుండి చివరికొసదాకా సమానంగా వుంటాయి. పై భాగంలో దళసరిగా వుంటే అది స్త్రీ ధర్భ గా గుర్తిస్తారు. అడుగున దళసరిగా వున్న ధర్భను నపుంసక ధర్భ గా తెలుసుకోవచ్చును.

ధర్భల దిగువ భాగంలో బ్రహ్మకు , మధ్యస్థానంలో మహావిష్ణువుకు , శిఖరాన పరమశివునికి నివాసంగా భావిస్తారు.

దేవతలను తలచుకొని యిచ్చే తర్పణాలు ధర్భ కొసలతోను, మానవులను తలచి యిచ్చే తర్పణాలలో ధర్భల మధ్యభాగం నుండి, పితృదేవతలను తలచుకొని యిచ్చే తర్పణాలలో ధర్భను మడిచి కొసలతోనూ తర్పణాలు సమర్పించడం విధాయకంగా వుంది.

వైదికకార్యాలలో , "పవిత్రం" అనే పేరుతో ధర్భతో చేసిన ఒక ఉంగరాన్ని కుడి చేతి ఉంగరం వేలికి ధరింపజేసి ఆయా కార్యాలను ఆచరింపజేస్తారు .ఈ వ్రేలిలో కఫనాడి వుండడం వలన యీ ఉంగర ధారణవలన కఫం శుభ్రం చేయబడుతోంది.

ప్రేత కార్యాలలో ఒక ధర్భతోను, శుభ కార్యాలలో రెండు ధర్భలతోను, పితృ కార్యాలలో మూడు ధర్భలతోను , దేవ కార్యాలలో నాలుగు ధర్భలతోను, ఆ ధర్భ ఉంగరాన్ని ముడి వేస్తారు.

దేవతారాధన, జపం, హెూమం, దానం తర్పణం వంటి కార్యాలలో ధర్భతో చేసిన 'పవిత్రం' అనే యీ ఉంగరాన్ని తప్పనిసరిగా ధరించాలి.

ధర్భగడ్డిలో పులుపు, క్షార గుణాలు వుండడం వలన రాగి విగ్రహాలను , బూడిద ధర్భలు ఉపయోగించి శుభ్రపర్చాలని శిల్ప శాస్త్రం చెప్తోంది.

ఇందు వలన శిల్పాలలోని ఆవాహన మంత్ర శక్తి తరగకుండా చాలా రోజులు ప్రకాశవంతంగా వుంటాయని శాస్త్రజ్ఞులు చెపుతారు.

ఆదివారమునాడు కోసిన ధర్భలను ఒక వారముపాటు ఉపయోగించవచ్చును. అమావాస్య నాడు కోసి తీసుకుని వస్తే ఒక మాసం వరకు ఉపయోగించవచ్చును.

పౌర్ణమినాడు కోసి తెస్తే పదిహేను రోజులు ఉపయోగించ వచ్చును.

శ్రావణమాసం లో కోసిన ధర్భలైతే తీసుకుని వస్తే ఒక ఏడాది ఉపయోగించ వచ్చును. భాద్రపద మాసంలో తీసుకుని వస్తే ఆరు మాసాలు ఉపయోగించ వచ్చును. శ్రాద్ధ కార్యాలకోసం తెచ్చిన ధర్భలను ఏ రోజు కా రోజే ఉపయోగించాలి. తిరునల్లారు శైవ క్షేత్రంలో ధర్భలే స్థల వృక్షం. ఈ క్షేత్రంలో నెలవైయున్న ఈశ్వరుని పేరు ధర్భారణ్యేశ్వరుడు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

పాడేరు, (విశాఖ సమాచారమ్): రైతులు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రజలకు, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్య మంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేసారు. తుఫాను ప్రభావిత జిల్లాలోని కలెక్టర్లతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావానికి జరిగిన నష్టం, పునరావాస చర్యలు తదితర అంశాలపై చర్చించారు. తుఫాను బాధితులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. దెబ్బతిన్న రహదారులు, విద్యుత్తు పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేసి సాధారణ పరిస్థితులనుతీసుకుని రావాలని ఆదేశించారు. వ్యాదులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపైఅధికారులు దృష్టి పెట్టాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని చెప్పారు. రైతులకు రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తామన్నారు.

తుఫాను నష్టాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు.

జిల్లాలో తుఫాను ప్రభావానికి దెబ్బతిన్న ఇళ్లు, వ్యసాయ పంటలు, ఉద్యాన పంటలు, పశు సంపద నష్టం, నీటి పారుదల వ్యవస్థలపై అధికారులతో చర్చించారు. వివిధ శాఖల వారీగా జరిగిన నష్టాల పై నివేదికలు సమర్పిం చాలని ఆదేశించారు. రోడ్డు పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఎ ఎస్పీ ధీరజ్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, డీ. ఆర్. ఓ పి. అంబేద్కర్, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ కె. పట్నాయక్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, రహదారులు భవనాల శాలక ఇ ఇ బాలసుందర బాబు, గృహ నిర్మాణశాఖ ఇ ఇ బి. బాబు, పంచాయతీ రాజ్ ఇ ఇ కొండయ్య పడాల్ అతదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన జివిఎంసి కమిషనర్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా నగరంలో గల కాలువలు, గెడ్డలు పొంగిపొర్ల కుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని, జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

బుధవారం ఆయన 4 వ జోన్ పరిధిలోని సిహార్ట్ జంక్షన్ నుండి పోర్ట్ ఏరియా మీదుగా రోస్ హిల్స్ చర్చి దిగువ భాగం వరకు ఉన్న ఎస్.ఎల్ కెనాల్ నందు,కాన్వెంట్ జంక్షన్ ప్రధాన కాలువ నందు వర్షం కారణంగా ఏర్పడిన వ్యర్థాలను, విరిగి పడిన చెట్ల కొమ్మలను జెసిబి యంత్రాల ద్వారా సిబ్బంది తొలగిస్తున్న పనులను పరిశీలించారు. రోస్ హిల్స్ చర్చ్ దిగువన పోర్టు ప్రాంతం నందు జరుగుతున్న కాలువ, రోడ్డు పనులను పరిశీలించారు .

ఆ పరిసరాల్లో కోటవీధి నివాసిత ప్రాంతంలో ఉన్న రోడ్డపై వ్యర్థాలను గమనించిన కమిషనర్ అచ్చట వెంటనే డంపర్ బిన్ ను ఏర్పాటు చేయాలని ఎ.ఎం.ఓ.హెచ్ రాజేష్ ను ఆదేశించారు. పోర్టు నుండి వస్తున్న దుమ్ము, దూళి వలన, పలుచోట్ల మురుగునీరు చేరడం వలన దోమలు చేరి వ్యాధులకు గురవుతున్నామని ఆ ప్రాంత నివాసితులు కమిషనర్ కు తెలుపగా కమిషనర్ స్పందిస్తూ, ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరచాలని, గంబూషియా చేపలను విడుదలచేసే ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ ను ఆదేశించారు. దోమలు నియంత్రణకై ఫాగింగ్, మంచినీటి సరఫరా నిత్యం జరుగుతున్నదీ, లేనిదీ నివాసితులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జ్ఞానాపురం, కంచరపాలెం, ఎస్ఏడి, తదితర ప్రాంతాలలో పర్యటించి ఆయా ప్రాంతాలలో పలుచోట్ల వ్యర్థాలు, వర్షపు నీరు నిల్వలను పరిశీలించి వ్యర్థాలను వెంటనే తొలగించాలని, తుఫాను వలన కాలువల్లో ఏర్పడుతున్న అడ్డంకులను వెంటనే తొలగించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, రవాణా సౌకర్యానికి ఆటంకాలు లేకుండా అవసరమయ్యే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్.జి.వి కృష్ణ, ఏసీపీ వినయప్రసాద్, కార్యనిర్వ ఇంజనీర్ సంతోష, ఏ.ఎం.ఓ. హెచ్ రాజేష్, శానిటరీ సూపర్వైజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకువెళ్లాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకువెళ్లాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, తెలిపారు. డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జి అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగ నిర్మాత, మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిన్న వయసు నుంచి ఎంతగానో శ్రమించి, ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ కష్టపడి చదివి అనేక డిగ్రీలు పూర్తి చేసిన అవరమేదవి. దీనజనరొద్దణకు, అస్పృశ్యత నిర్మూలనకు, అంటరానితనం నిర్మూలించడానికి, సమాజంలో ప్రజల మధ్య ఐక్యత తీసుకురావడానికి అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎన్నో కులాలు, మతాలు, జమీందారీ సంస్థానాలతో ఉన్న మన భారతదేశాన్ని కుల, మత, వర్గ, వర్గ విచక్షణ లేకుండా ప్రతి మనిషికి ఒకే విలువనిస్తూ విశాల భారతదేశాన్ని సమూలంగా ఏకతాటిపై నిలిపే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించి మనకు అందించార న్నారు.నేటి యువత అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని తమ జీవిత లక్ష్యాలను సాధించలవన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయ పౌరుడి పై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, ఇన్స్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు ఎస్సైలు రఘువర్మ, వెంకన్న కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డా.బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నేడు శ్రీ బాబా సాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా ఉప రవాణా కమిషనర్ విశాఖపట్నం వారి కార్యాలయం లో ఆయన చిత్రపటమునకు పూల దండలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా డి.టి.సి రాజ రత్నం గారు మాట్లాడుతూ నేడు శ్రీ బాబా సాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ 67 వ వర్ధంతి సందర్భంగా ఆయనని స్మరించుకోవడం ఎంతో అవసరమని గొప్ప సంఘ సంస్కర్తగా మరియు, భారత రాజ్యాంగం నిర్మాతగా, బలహీన, వెనకబడిన వర్గాలకే కాకుండా, ప్రతి ఒక్క కుల మత జాతికి మేలు చేకురేలా భారత రాజ్యాంగాన్ని రచించారని, దేశానికి న్యాయ శాఖ మంత్రిగా భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని వారి యొక్క స్ఫూర్తి మనకు ఎంతో అవసరమని తెలియజేశారు. అనంతరం చిత్రపటమునకు పూల దండలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమములో ఆర్.టి.ఓ శ్రీ ఆర్.సి. ఎచ్.శ్రీనివాస్, ఇంచార్జి ఆర్.టి.ఓ శ్రీ ఐ. వేణు గోపాల రావు ఎ.ఓ.లు ఐ.రఘు బాబు, జి. విమల, జి.కోటేశ్వర రావు, డి. కరుణాకర్ మరియు కార్యాలయ సబ్బంది పాల్గొన్నారు.

గాజువాకలోని గెడ్డలను పరిశీలించిన నగర మేయర్ గొలగాని, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మిచౌంగ్ తుఫాన్ వలన నగరంలో విస్తృతంగా పడుతున్న వర్షాల వలన గాజువాక ప్రాంతంలోని పలు గెడ్డలను పొంగకుండా చర్యలు చేపట్టామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. బుధవారం అమె గాజువాక జోన్ పరిధిలోని 75 వ వార్డు పెంటమాంబ ఉటగడ్డను, 76వ వార్డు ప్రధాన కాలువను, నడిపూరి గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి తో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తుఫాను వలన వర్షాలు విస్తృతంగా పడుతున్నందున వార్డులోని ప్రధాన గెడ్డలుపొంగకుండా పటిష్ట చర్యలు చేపట్టామని, ప్రతి గెడ్డలోని వ్యర్థాలను, అడ్డంకులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి వాటిని తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 75 వ వార్డు పెంటమాంబ ఉటగడ్డను యొక్క ఎత్తు పెంచాలని, 76వ వార్డు లోని గంగవరం పోర్టు వద్ద ప్రధాన కాలువ రోడ్డు కంటే ఎత్తు తక్కువగా ఉన్నందున బాక్స్ టైపు కాలువ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గంగవరం ఫ్లైఓవర్ నడిపూర్ గెడ్డను పరిశీలించి గెడ్డలు శుభ్రంగా ఉంచాలని వర్షపు ముంపు లేకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, కార్య నిర్వహణ ఇంజనీర్ ప్రసాద్ బాబు, గంగవరం పిఆర్ఓ వెంకట్ స్టీల్ ప్లాంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓటమికి ఈవీఎంలే కారణం: దిగ్విజయ్ సింగ్

మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ఈవీఎంలే కారణమని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. ఈవీఎంల ద్వారా ఓటింగ్ జరపడాన్ని తాను 2003 నుంచి వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. చిప్ ఉండే ఏ మెషీన్ ను అయినా హ్యాక్ చేయవచ్చని అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని హ్యాకర్లు నియంత్రించడాన్ని మనం అంగీకరిద్దామా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కౌంటింగ్ కు ముందే ఖజ్రోడ్ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితాలు బీజేపీ నేత అనిల్ చజేడ్ కు ఎలా తెలుసని ప్రశ్నించారు. అయన ముందే చెప్పిన ఫలితాలు, చివరకు వచ్చిన ఫలితాలు ఒకేలా ఉన్నాయని తెలిపారు. మరోవైపు, ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. గెలిస్తే వారికి ఈవీఎంలు మంచివని... ఓడిపోతే వాటిపై నింద వేస్తారని దుయ్యబట్టారు.

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే గొల్ల బాబురావు

నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి ఎస్ రాయవరం మండలం లలో పలు గ్రామాలలో గత రెండు రోజులుగా ఏడ తెరుపు లేకుండా కురుస్తున్న వర్షం పు నీటితో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలను పరామర్శించిన గొల్ల బాబురావు. చిన్న గుమ్ములూరు, పెద్ద గుమ్ములూరు, నక్కపల్లి ప్రాంతాలను ఎమ్మెల్యే గొల్ల బాబురావు స్వయంగా వచ్చి పరిశీలించడం జరిగింది. మీరు ఎవరు ఆందోళన చెందొద్దు అంటూ మీకు సంబంధిత సహాయ సహకారాలు అధికారులను అందించమని ప్రభుత్వం ఆదేశించిందంటూ, మీకు ఎటువంటి అత్యవసర పరిస్థితులు అయిన అధికారులను సంప్రదించవలసిందిగా వారి మాటలలో తెలియజేశారు. ముంపుగ్రైన గృహాలను పూరి గుడిసెలో

ఉన్న వారిని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో నివాసం ఉండేలాగా ప్రజల్ని సూచించారు. అంతేకాకుండా మీ అందరికీ భోజన వసతులు అన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ ఏ ఒక్కరు ఆందోళన పడొద్దు అంటూ మీ ఎటువంటి కష్టం వచ్చినా మీ ముందు మీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నేనున్నానంటూ ప్రజలందరికీ అయన భరోసా ఇచ్చారు. ఈ సమయంలో ఏ సమస్యలైన తక్షణమే పరిష్కారం చేయాలంటూ అధికారులను ఆదేశించారు.వీరితో పాటు నర్సింహా మూర్తి శేషారత్నం తాతబాబు అధికారులు తదితరులు పర్యటించారు.

నక్కపల్లి లో వీసం రామకృష్ణ నెత్రుత్వంలో వైస్ ఎంపీపీ నానాజి వీవర్స్ కాలనీ వర్షాలు కు నీటితో నిండిపోయింది వారు వెంటనే జేసిబీ తో పూడికి తీత పనులు యుద్ధప్రతిపదికన చేయించి ఆదుకుని కాలనీ వాసులు కు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాట్లు చేసి ఆయనే స్వయంగా వడ్డించారు వీరితో పాటు వీసం రాజు బంగార్రాజు అల్లాడ కొండ వైసీపీ కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో తుఫాన్ కారణంగా భారీ నష్టం

పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పైడిమాంబ అలయం రక్షక గోడను, పెద్ద చెరువు, ఊర చెరువు పొలాలను బుధవారం పరిశీలించి పంట నష్టాన్ని, గ్రామంలో అస్తి నష్టాన్ని అంచనా వేయాలని పరవాడ మండల స్పెషల్ ఆఫీసర్ డైజ సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరవాడ లో సుమారు 30 ఎకరాలు నష్టం వాటిల్లిందని తెలిపారు, ఇలాంటి సమయంలో ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని జరిగిన నష్టానికి ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు , ఎంపీడీఓ హేమ సుందరరావు, తహసీల్దార్ కనకరావు, సీఐ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ బందారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి చంద్రవతి , పంచాయతీ ఏఈ గంధి రామారావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుత రావు, వై.సి.పి నాయకులు బొడ్డపు చిన్నారావు, వర్రి హరి తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న బి.ఆర్.అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం అమె డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆరిలోవ పార్వతీ నగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత భారతరత్న బి.ఆర్.అంబేద్కర్ దేశానికి ఎంతో సేవ చేశారని, స్వాతంత్ర సమరయోధుడు, న్యాయవాది, రాజకీయవేత్త, సంఘసంస్కర్త, భారతదేశ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. అలాగే స్వతంత్ర భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆరిలోవ పార్వతి నగర్ అంబేద్కర్ సేవా సంఘ సభ్యులు వైఎస్ఆర్సిపి నాయకులు, పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు యూజీసి నెట్ పరీక్షలు

అసిస్టెంట్ ప్రొఫెసర్ ,జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ అర్హత పరీక్ష అయిన యూజీసీ నెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. డిసెంబర్ 6 నుంచి 8 వరకు మూడు రోజులపాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా 292 పట్టణాల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. మొత్తం 83 సబ్జెక్టులకు గాను ఈ పరీక్షలు ఉంటాయి. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యూజీసీ నెట్) తెలిపింది. ఆయా తేదీల్లో రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. మొదటి షిఫ్టులో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండో షిఫ్టులో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో మాత్రమే ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేయడం జరిగింది. అభ్యర్థులు పరీక్ష రోజు ఉదయం వరకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌తోపాటు https://ugcnet.nta.nic.in వెబ్‌సైట్ ద్వారా కూడా తమ హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టిఎ వివరించింది.

యూజీసి నెట్ నిర్వహించే ఈ పరీక్షలు ఆఫ్‌లైన్‌లోనే ఉంటాయి. కంప్యూటర్ ఆధారితంగా ఈ పరీక్షలను నిర్వహిస్తారు. యూజీసి నెట్‌లో మంచి స్కోర్ సాధిస్తే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడే అవకాశముంటుంది.

150 ప్రశ్నలు...300 మార్కులు : ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో మొత్తం 2 పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లకు కలిపి మూడు గంటల సమయం ఉంటుంది. పేపర్-1కు గంట సమయం, పేపర్-2 కు రెండు గంటల సమయం ఉంటుంది. పేపర్-1 లో 100 మార్కులకు గాను 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్ర హెన్షన్, డైవర్‌జెంట్ థింకింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పేపర్ అందరికి కామన్‌గా ఉంటుంది.

ఇక, పేపర్-2లో 200 మార్కులకుగాను 100 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అభ్యర్థికి సంబంధించిన సబ్జెక్టు నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రశ్నలు ఉంటాయి.

ప్రకాశం బ్యారేజ్ నాలుగు గేట్లు ఎత్తివేసిన అధికారులు

విజయవాడ: తుఫాన్ ప్రభావంతో ఆంధ్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.

ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీటికి తోడు జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు, పొంగిపొర్లుతున్నాయి. దీంతో కృష్ణ నది పై విజయవాడ వద్ద ఉన్న ప్రకాశం బ్యారేజి కి వరద తాకిడి భారీగా పెరిగింది.

బ్యారేజి నిల్వ సామర్థ్యం 3.09 టీఎంసీలు మించి వరద నీరు ఉండడంతో అధికారులు గేట్లను ఎత్తి మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు.

బుధవారం ఉదయం 10 గంటల సమయంలో బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి నిల్వను ఉంచుతూ దిగువకు సుమారు 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ప్రస్తుతం బ్యారేజి వద్ద నాలుగు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 6667 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్ఫ్లో2908 క్యూసెక్కులుగా ఉండగా అవుట్ ఫ్లో 7వేల క్యూసెక్కులు గా ఉంది.

ఇటీవల జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురిసిన నేపథ్యంలో కుడి ఆలమ కాలువలకు సాగునీటి విడుదలను అధికారులు నిలి నిలుపుదల చేశారు. బిరబిరా పారుతున్న కృష్ణమ్మ సాగరే ఒడిలో కలిసేందుకు పరుగులు తీస్తోంది.

బ్యారేజి నుండి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నదీ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

కేకే లైన్ లో విరిగిపడిన కొండచరియ

ఒక ఇంజిన్ రెండు బోగీలో ధ్వంసం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): తుఫాన్ దాటికి కొత్తవలస కిరండోల్ కేకే లైన్లో శివలింగపురం రైల్వే స్టేషన్ వద్ద విశాఖ నుండి కిరండోల్ కు వెళ్తున్న గూడ్స్ రైలు పై భారీకొండ చర్య విరిగిపడడంతో గ్రూడ్స్ రైలు కు ముందు భాగంలో భారీ బండరాయి దొర్లు కొని వచ్చి రైలు ఇంజన్ కు ఢీ కొట్టడంతో ఒక ఇంజన్ రెండు వ్యాగన్లు ధ్వంసమయ్యాయి అయితే కొత్తగా నిర్మిస్తున్న రెండోవ ట్రాక్ కు సంబంధించిన రోడ్డుపై ఉన్న కొండ చరియ జారి పడటంతో ఈ సంఘటన చోటుచేసుకుందని దీంతో రైల్వే శాఖ అప్రమత్తమై రైల్వే ట్రాక్ పునరుద్ధరణ చర్య చేపట్టారు భారీ వర్షం కావడంతో కూలిలను జెసిబిలను తరలించే అవకాశం లేకపావడంతో ట్రాక్ పునరుద్ధరణ చేపట్టడానికి మరో 12:00 సమయం పట్టవచ్చని రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

బిఆర్ అంబెద్కర్ కి నివాళలర్పించిన త వెఎస్ఆర్ సిపినాయకులు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలోవైస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఎస్సి విభాగం జోనల్ ఇన్చార్జ్అ ల్లంపల్లి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కేకే రాజు,మాజీ శాసన సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర మరియు బిసి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి రాష్ట్ర వైస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు పాల్గొని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఎమ్మెస్ రావ్ షాపింగ్ మాల్ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎం.వి.ఆర్

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణంలోని మెయిన్ రోడ్ లో ఉన్న ఎమ్మెస్ రావు షాపింగ్ మాల్ 24 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకట్వేశ్వరరావు కుటుంబ సమేతంగా షాపింగ్ మాల్ ను సందర్శించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆఫర్స్ పై ఆరా తీశారు. అనకాపల్లి ప్రజలకు అందుబాటు ధరలలో వస్త్రాలను అందించాలని ఎం.వి.ఆర్ కోరారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ దంపతులను భారీ గజమాలతో షాపింగ్ మాల్ యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాన్న ఎవరు?

బ్రహ్మదేవుడు చాలా బిజిగా తల రాతలు రాసే పనిలో ఉన్నాడు. ఇంతలో నేను, భూమి మీదకు వెళ్ళను అని మారాం చేయడం మొదలుపెట్టాను.

"భూమి మీద నాకు ఎవ్వరూ తెలీదు. నేను ఎలా బతకగలను? అని అడిగాను. నువ్వేం భయపడకు. నిన్ను కాచి కాపాడటానికి నా అంశగా ఒక అమ్మను తయారుచేశాను. ఆమె కడుపులో నిన్ను పుట్టిస్తా" అన్నాడు బ్రహ్మదేవుడు.

"అయితే సరే, కానీ నాకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా నేను ఏడవటం మొదలుపెడతా. అప్పుడు మీరు నా ఇబ్బందిని తొలగించాలి" అనే షరతు పెట్టాను.

దానికి బ్రహ్మ, "సరే నీకు మాటలు రానంత వరకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులం ముగ్గురు నీకు సహాయం చేస్తాం" అన్నాడు.

"మరి, ఆ తర్వాత చెయ్యరా?" అని అడిగా.

"అదేం లేదులే. నీకు మాటలొచ్చాక నీకో మహా మంత్రం బోధిస్తాం. నీకు ఏ కష్టం వచ్చినా, ఒక్కసారి ఆ మంత్రం పఠిస్తే తప్ప కుండా నీకు సహాయం దొరుకుతుంది." అని చెప్పాడు బ్రహ్మ.

మళ్ళీ ఇంకేదో అడగబోయే లోపల ఆ పరబ్రహ్మ, తన బెడ్రూం బాల్కనీ లోంచి నన్ను కిందకి త్రోసేశాడు. ఎలా వచ్చి చేరానో తెలి యదు గానీ, ఆసుపత్రి బెడ్ మీద మా అమ్మ పక్కన వచ్చిపడ్డాను.

అమ్మ పక్కన హాయిగా నిద్రపోతున్న నన్ను, ఓ పెద్దమనిషి తన చేతిలోకి తీసుకున్నాడు. భయమేసి, అమ్మ వైపు చూసి ఏడుపు ముఖం పెట్టాను. "మీ నాన్నగారు రా!" అంటూ అమ్మ తన కంటి చూపు తో ఆయన్ని పరిచయం చేసింది.

బ్రహ్మదేవుడు నాకు అమ్మ గురించి చెప్పి పంపాడు. తను అన్ని చోట్ల ఉండటం కుదరక అమ్మని సృష్టించాను అని. మరి నాన్న అంటే ఎవరు? భూమి మీద పడిన మొదటి రోజే నా బుర్రలో ఎన్నో ఆలోచనలు మొదలయ్యాయి.ఆ దేవుడినే అడిగి తెలుసుకుందామని ఏడుపు మొదలుపెట్టా.

"ఇప్పుడే కదా భూమి మీద పడ్డావు. అప్పుడే నన్ను గుర్తుచేసుకున్నావేమిటి?" అని అడిగాడు. అమ్మ గురించి చెప్పారు గాని, నాన్న గురించి ఏమీ చెప్పలేదేంటని అడిగా.

"నీ జన్మకి నాంది, నీ భవితకు పునాది" అని ముక్తసరిగా బదులిచ్చి, "అర్థమైందా?" అని ప్రశ్నించాడు.

"పాలు తాగే పసివాడి ప్రశ్నకి ప్రాస తో బదులిస్తే ఎలా అర్థం అవుతుంది స్వామీ" అని సమాధానం చెప్పాను.

ఒక అర్థం లేని చిరునవ్వు నవ్వి, "నీకూ మీ అమ్మకు కాపుగా నేను నియమించిన అంగరక్షకుడు" అని క్లుప్తంగా చెప్పాడు. అప్పుడు అర్థమైంది నా బుజ్జి బుర్రకి, నా కష్టం తీర్చేది అమ్మ అని. మాకు ఏ కష్టం రాకుండా చూసుకునే బాధ్యత నాన్నదని.

ఆ రోజు నుంచి నా చిన్ని కళ్ళు నాన్న కోసం వెతుకుతూనే ఉండేవి. ఎప్పుడో ఉదయాన్నే వెళ్ళిపోయి సాయంత్రం వచ్చేవాడు. "ఏం, నేనంటే ప్రేమ లేదా" అని ప్రశ్నించా ఆ దేవుడిని మళ్ళీ. "నీ మీద ప్రేమ ఉంది కాబట్టే, రోజూ బయటికి వెళ్ళి కష్టపడి పని చేసి వస్తున్నాడు" అని బదులిచ్చాడు బ్రహ్మ. అర్థం కాలేదని చెప్పాను. కొన్నేళ్లకు నీకే అర్థం అవుతుందిలే అన్నాడు.

ఈయన అన్ని తల తిక్క సమాధానాలే చెబుతాడులే అనుకుని, నా దగ్గరికి వచ్చిన మా నాన్న మొహం చూసా. మా నాన్న ముఖం నీరసంగా కనిపించింది. పలకరింపు కోసం ఒక చిరునవ్వు నవ్వా. మా నాన్న ముఖం లోని నీరసం మాయమైంది. నన్ను చూసిన ఆయన ముఖం పున్నమి చంద్రుడిలా మెరిసిపోసాగింది. ఆ దేవ దేవుడు నా నవ్వులో ఇంత మహిమ దాచాడా! అని గర్వపడటం మొదలుపెట్టా.

మళ్ళీ మళ్ళీ నవ్వడం నేర్చుకున్నా. నేను నవ్విన ప్రతి సారి, మా నాన్న ముఖంలో ఆనందం పది రెట్లు ఎక్కువగా కనిపించేది. మా నాన్న నన్ను ముద్దులతో ముంచేయటం మొదలుపెట్టారు. అలా ఆ సాయంత్రాలు మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని పెంచాయి.

కొన్నాళ్ళకి, నా చిట్టి పాదాలకి కొంచెం బలం చేకూరింది. నడక నేర్చుకుందామని ప్రయత్నించా. కానీ ఫలితం లేదు. పదే పదే పడిపోతూనే ఉన్నా. ఇంతలో నాన్న తన చూపుడు వేలును నాకు అందించాడు. నేను నడవలేకపోతున్నానని వెక్కిరిస్తున్నా డనుకున్నా! "నా వేలు పట్టుకుని నిల్చో నాన్నా" అన్నారు.

నిలబడగలిగాను కానీ, నా అడుగులు ఇంకా తడబడుతూనే ఉన్నాయి. ఆ మహా శివుణ్ణి, మనసులో ప్రార్థించడం మొదలుపెట్టా. తన ఢమరుక నాదంతో నా పాదాలని ప్రేరేపించమని ప్రాధేయపడ్డాను. ఆ ఢమరుక నాదపు సడిలో, పడి పడిగా అడుగులు వేయటం నేర్చుకుని మా నాన్నను ఆశ్చర్యపరుద్దామనుకున్నా. ఆ మహా శివుడికి నా మొర వినిపించలేదేమో! నా ప్రార్థనకి జవాబు దొరకలేదు. ఇంతలో మా నాన్న వెల్లకిలా పడుకున్నారు. నన్ను తన రెండు చేతులతో పట్టుకుని తన గుండెల మీద నిలబెట్టుకున్నారు. ఢమరుక నాదం లేకపోతేనేం!, నా గుండె చప్పుడుని నీ అరికాళ్ళతో అనుభవించి అడుగులు వేయటం నేర్చుకోమని అభయమిచ్చారు. ఏం మాయో తెలీదు. నాన్న గుండె చప్పుడు నా కాళ్ళకి తగలగానే నేనే శివుడిలా మారిపోయా. నడక రాని నేను నాన్న గుండెల మీద యధేచ్ఛగా నాట్యం చేయటం మొదలుపెట్టా. నేను చిందు వేసిన ప్రతి అడుగూ నాన్న ఆనందాన్ని మరింత పెంచింది.

నడక నేర్చిన నా చిన్ని పాదాలు కొత్త గమ్యాలను వెతకటం ప్రారంభించాయి. నడవటం మొదలుపెట్టాను. కొంత దూరం వెళ్ళాక, అటూ ఇటూ చూశాను. ఎవ్వరూ కనిపించలేదు. భయం వేసింది. ఆ శ్రీ మహా విష్ణువు అన్న బోట్ల ఉంటాడుగా, మరి నాకు భయమెందుకు. అయన్నే పిలుద్దాం అని మనసులో తలుచుకున్నా. ఆయన కనిపించలేదు గాని వినిపించాడు. "ఏమైంది బాలకా" అని అన్నాడు. "భయం వేసింది స్వామి. అందుకే పిలిచా" అన్నా నేను.

"భయం ఎందుకు? నీవు నడుస్తుంది మీ నాన్న నీడలోనేగా" అన్నాడు. ఆశ్చర్యం వేసి వెనక్కి తిరిగి చూసా. అవును నాన్న నా వెనకే ఉన్నారు. నాకు తగినంత స్వేచ్ఛనిస్తూ, నా ప్రయాణాన్ని గమనిస్తూ, నన్ను తప్పటడుగు వేయనీయకుండా, ఒకవేళ అలా వేసినా తప్పులను సరిదిస్తూ.. నన్ను ఏ ప్రమాదం తాకకుండా, నాకు రక్షణగా నా వెనకే నడుస్తున్నారు. నా మనసులో భయం తొలగి ముఖంలో చిరునవ్వు మొదలయ్యింది. అప్రయత్నంగానే నా పెదవులు 'నాన్న' అని పలకటం మొదలుపెట్టాయి. నాన్న నన్ను ఎత్తుకుని నా ముఖమంతా ముద్దులతో ముంచేశారు. మళ్ళీ మళ్ళీ నాన్న అని పిలవమన్నారు. నేను పిలిచిన కొద్దీ, నాన్న ముఖంలో ఆనందం రెట్టింపు అవుతూనే ఉంది.

నాకు ఏ అవసరం వచ్చినా, ఏర్పిన ఆ దేవుడిని పిలిచే బదులు, మా నాన్నని పిలవడమే మేలు అనిపించింది. దేవుడు వచ్చేవాడో, రాడో తెలీదు గాని మా నాన్న మాత్రం నన్ను కంటికి రెప్పలా కాపాడుతూనే ఉన్నాడు. నా అవసరాలన్నీ, నేను చెప్పక ముందే తెలుసుకుని మరీ తీర్చేవాడు. కొన్నాళ్ళకు నాన్న కూడా ఆ దేవుడి దగ్గరికే వెళ్ళిపోయారు. కానీ ఆయన నేర్పిన జీవిత పాఠాలు నాకు తోడుగా ఉండేవి. నాన్న మాట మాత్రం కొంచెం కటువుగానే ఉండేది. నేను తప్పుచేసిన ప్రతిసారీ నన్ను మందలించేవారు. మందలించిన ప్రతిసారీ ఏమిటి ఈ నాన్న... అని అనిపించేది.

ఆఖరికి నేను కూడా ఆ దేవుడి దగ్గరికి తిరుగు ప్రయాణం మొదలుపెట్టాను.

"నీ జీవిత మజిలీ ఎలా సాగింది?" అని ప్రశ్నించారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు.

"పీరు నాకు ఏ "మంత్రమూ" బోధించకపోయినప్పటికీ, నా జీవన చక్రం బాగానే సాగింది ప్రభూ." అని సమాధానం చెప్పాను గర్వంగా.

"అదేంటి అలా అంటావ్! మేము నీ నోట పలికించిన "మంత్రాన్ని" రోజు నువ్వు పఠిస్తుండటం మేము గమనిస్తూనే ఉన్నాం" అన్నారు మూకుమ్మడిగా.

"నాకు ఏం అర్థం కావట్లేదు స్వామి" అని బదులిచ్చా నేను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు ఒకరిలో ఒకరు ఐక్యం అవుతూ ఒకే రూపంగా మారి ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యపోయాను. మా "నాన్న" రూపం నా ముందు ప్రత్యక్షమైంది. అప్పుడు గానీ అర్థం కాలేదు ఈ మనిషి బుర్రకి, (మట్టి బుర్రకి). "అమ్మ ఆ దేవుడి అంశ అని" "నాన్న సాక్ష్యాత్ దేవుడని". మిమ్మల్ని గుర్తించలేకపోయాను, నన్ను క్షమించండి స్వామి. అని ఆయన పాదాలమీద సాగిలపడ్డాను.

ఆ దేవుడి ముఖంలో అదే చెరగని చిరునవ్వు. నా భుజాల మీద చేయి వేసి పైకి లేపారు. ప్రేమగా హత్తుకున్నారు. నన్ను క్షమించి, నా ఆత్మకు మోక్షం ప్రసాదించండి స్వామి అని అడిగా ఆయన చెవిలో. క్షమిస్తా, కానీ ఒక్క షరతుతో అన్నాడు ఆ దేవ దేవుడు. ఏమిటది స్వామీ! అని అడిగా ఆశ్చర్యంగా. నన్ను ఆఖరుసారిగా 'నాన్న' అని సంభోదించగలవా అని అడిగారు ఆ సర్వేశ్వరులు. ఆ మహా మంత్రాన్ని ఇంకోసారి జపించడానికి, నిముషం కూడా ఆలస్యం చేయలేదు నేను. "నాన్న" అని పిలిచి ఆయనలోనే ఐక్యం అయిపోయా.

"అమ్మ" దేవుడి అంశ అయితే, "నాన్న" సాక్ష్యాత్ దేవుడే"

ఈ వ్యాసం ప్రతి ఒక్క నాన్నకు... నాన్నను ప్రేమించే పిల్లలకు... అంకితం.

హెచ్-1బీ వీసా రెన్యువల్ కి పైలెట్ ప్రాజెక్ట్... నిపుణులకు మాత్రమే!

కొన్ని కేటగిరీల హెచ్-1బీ వీసాలను దేశీయంగానే రెన్యువల్ చేసుకునే విధంగా అమెరికా ఇటీవల ఓ పైలట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో ఈ కార్యక్రమం మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుందని అమెరికా విదేశాంగ వెల్లడించింది. హెచ్-1బీ వీసా పునరుద్ధరణ విధానాన్ని మరింత సరళీకరించేం కార్యక్రమాల్లో భాగంగా దీన్ని చేపట్టింది.

ఇది కేవలం నిపుణులకు మాత్రమేనని తెలిపింది. ఆయా నిపుణుల కుటుంబీకులకు కానీ, వారిపై ఆధారపడిన వారికి కానీ ఇది వర్తించదని తెలిపింది.

ఈ క్రమంలో ఈ పైలెట్ ప్రాజెక్ట్ చేపట్టడానికి గల కారణాలు, అది నిపుణులకు ఎంత ఉపయోగకరంగా ఉంటుందనే విషయాలు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా... గతంలో వీసా రెన్యువల్ కోసం అమెరికా విడిచి వెళ్లాల్సి వచ్చేదని.. అయితే ఈ కొత్త పైలెట్ ప్రాజెక్ట్ ఈ సమస్య నుంచి గణనీయ మార్పు తీసుకువస్తుందని వీసా సేవల డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ జూలీ స్టఫ్ తెలిపారు.

ఇదే సమయంలో ఈ సౌలభ్యాన్ని నిపుణుల కుటుంబీకులకు విస్తృత పరిచేముందు వాటి ప్రభావాన్ని అంచనా వేయాల్సి ఉందని తెలిపారు. హెచ్-4 కింద నిపుణుల కుటుంబీకులకు కానీ... వారిపై ఆధారపడిన వారిని కానీ ఇందులో దేర్చాలని కోరుతూ ఆయా సంస్థల నుంచి వినతులు వచ్చిన నేపథ్యంలో ఇలా స్పందించారు.

అమెరికాలోనే వీసాలను పునరుద్ధరించే ఈ ప్రత్యేక కార్యక్రమం కింద తొలుత 20వేల మందికి వీసా రెన్యువల్ చేయనున్నారని తెలుస్తుంది. దీనికి దరఖాస్తు చేసుకునేవారు అమెరికా విదేశాంగ శాఖకు వీసాలను పంపించాల్సి ఉంటుంది. అయితే ఈ సమయంలో వారు దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేదు.

పార్ట్‌టైం జాబ్ మోసాలు.. 100కి పైగా వెబ్‌సైట్లపై కేంద్రం నిషేధం



దిల్లీ: వ్యవస్థీకృత అక్రమ పెట్టుబడులు, టాస్క్-ఆధారిత పార్ట్‌టైం జాబ్ మోసాలను అరికట్టేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తరహా మోసాలకు కారణమవుతున్న వెబ్‌సైట్లపై కొరడా ఝుళిపించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు దాదాపు 100కు పైగా వెబ్‌సైట్లను కేంద్ర ఐటీ శాఖ బ్లాక్ చేసింది. ఈ మేరకు బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

వ్యవస్థీకృతంగా మోసపూరిత పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ నేరాలపై కేంద్ర హోం శాఖకు చెందిన ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ విభాగం ఇటీవల పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ తరహా మోసాలు జరుగుతున్న కొన్ని వెబ్‌సైట్లను గుర్తించి.. వాటిని తక్షణమే బ్లాక్ చేయాలని ఐటీ శాఖకు సిఫార్సు చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ఐటీ శాఖ తమ ప్రత్యేక అధికారాలతో 100కి పైగా వెబ్‌సైట్లపై నిషేధం విధించింది.

ఆర్థిక నేరాలను ప్రోత్సహిస్తున్న ఈ వెబ్‌సైట్లను విదేశీ వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు ఐటీశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. డిజిటల్ ప్రకటనలు, చాట్ మెసెంజర్స్, రెంటెడ్ అకౌంట్లను వినియోగించి వీరు తమ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు తెలిపింది. ఇలా ఆర్థిక మోసాల నుంచి వచ్చిన సొమ్మును క్రిప్టో కరెన్సీలు, విదేశీ ఏటీఎం కార్డులు, ఇంటర్నేషనల్ ఫినిటెక్ కంపెనీల సాయంతో మనీలాండరింగ్ చేస్తున్నారని తాము గుర్తించినట్లు ఐటీశాఖ పేర్కొంది. అయితే, ఈ వెబ్‌సైట్ల వివరాలను కేంద్రం వెల్లడించలేదు.

ఈ సందర్భంగా పార్ట్‌టైం జాబ్ మోసాలపై కేంద్రం హెచ్చరికలు చేసింది. 'ఇంట్లోనే కూర్చుని సంపాదన' వంటి ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు యూజర్లను ఆకట్టుకుంటారని పేర్కొంది. రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులను ఎక్కువగా టార్గెట్ చేస్తారని తెలిపింది. "అలాంటి యాడ్స్ క్లిక్ చేయగానే.. వారి ఎకౌంట్లు వాట్సప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాల్లో యూజర్లతో మాట్లాడుతారు. వీడియోలు లైక్ చేయడం, సబ్‌స్క్రైబ్ చేయడం, రేటింగ్ ఇవ్వడం వంటి టాస్క్‌లు చేసి ఇంట్లోనే కూర్చుని డబ్బు సంపాదించొచ్చు అంటూ యూజర్లను వలలో వేసుకుంటారు. తొలుత కొంత కమిషన్ ఇచ్చి.. ఆ తర్వాత లాభాల ఆశజూపి పెట్టుబడి మోసాలకు పాల్పడుతారు" అని కేంద్రం తెలిపింది. ఇలాంటి మోసాల పట్ల యూజర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు చేయొద్దని సూచించింది.

ఇటీవల మహాదేవ్ బెట్టింగ్ యాప్ వివాదం నేపథ్యంలో అక్రమంగా బెట్టింగ్‌కు పాల్పడే 22 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం నిషేధం విధించిన విషయం తెలిసిందే. వాటిలో మహాదేవ్, రెడ్డీఅన్నప్రెస్టోప్రో వంటి యాప్‌లు ఉన్నాయి.

ఏక లవ్య పాఠశాలల సెక్యూరిటీ ఉద్యోగినిలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

పాడేరు, (విశాఖ సమాచారమ్): పాడేరు ఐటీడీఏ పరిధిలో ఏకలవ్య పాఠశాలలలో గిరిజన సెక్యూరిటీ గార్డులగా పనిచేస్తున్న 60 మంది పైగా నెల కు 7,500 రూ లకు పనిచేస్తున్న వారిని అక్రమ మార్గం తొలగించి వారికి ఉపాధి లేకుండా చెయ్యడం దారుణంగా ఉంది అని వైసీపీ నాయకులు తీరుపై బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజి స్థానిక ప్రజా ప్రతినిధులు పై దుయ్యబట్టారు, పాడేరులో ఐటీడీఏ ముందు నిరాహారదీక్ష చేస్తున్న వారిని ఆయన పాడేరు పర్యటన లో మంగళవారం వారివద్దకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారితో మాట్లాడారు ఈ సందర్భంగా పత్రికలలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో విద్యా సంస్థలు కి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ ప్రాంతంలో 17 ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆ పాఠశాల లో గిరిజన నిరుద్యోగ మహిళలు కు సెక్యూరిటీ ఉద్యోగుల గత కొంతకాలంగా పనిచేస్తూ ఉంటే వారిని కట్రాక్టర్ మారితే వారిని తొలగించి నేడు వారి జీవనోపాధి లేకుండా ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గెలిచినప్పుడు అన్ని ప్రాంతాల్లో ప్రజలు కావాలి కానీ ఇప్పుడు మాత్రం కొన్ని మండల ఉద్యోగిని లను ఉంచి కొన్ని మండలాల్లో తన సొంత వారిని నియమించారు అంటే వీరికి ప్రతి ది పంచుకొంటూ ప్రజల ఇబ్బందులు పలు చెయ్యడమేనా వీరి పాలన ప్రజలు ఇబ్బందులు పట్టింపు లేదు ఈ వైసీపీ ప్రజా ప్రతినిధులు కు నేడు ఇంతటి పర్వాలు కురుస్తున్నాయి వీరికి నీడలేదు ఉపాధి లేదు ఇక్కడి పాలకులు తీరుపై బీజేపీ మైనారిటీ మోర్చా, గిరిజన మోర్చా తీవ్రంగా ఖండిస్తూ వీరికి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము,అని బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజ అన్నారు,ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, గిరిజన సెక్యూరిటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఆలయానికి రుద్రాక్ష మండపం

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో మహానంది ప్రముఖమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో కొలువైన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆలయానికి భక్తుల నుంచి కానుకలు ఆభరణాలు వెల్లువెత్తు తున్నాయి. నంద్యాల జిల్లాకు చెందిన SBI రిటైర్డ్ మేనేజర్ మారం వెంకట సుబ్బయ్య దంపతులు 35 కేజీల వెండి తో తయారు చేయించిన రుద్రాక్ష మండ పాన్ని ఆలయానికి విరాళంగా అందిం చారు. రుద్రాక్ష మండపం గర్భాలయం లో స్వామి వారికి పై భాగాన అలంకరి స్తారు. వెండితో తయారు చేసిన రుద్రాక్ష మండపాన్ని ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డికి దాతలు అందజేశారు. కార్తీక మూడవ ఆలయంలో సంప్రోక్షణ అనం తరం దాతల కుటుంబీకులు శ్రీ మహానంధీశ్వర స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి రుద్రాక్ష మండపాన్ని అందజేశారు. దాతలు వెంకటసుబ్బయ్యకు కుటుంబీకులకు ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మరింత మంది భక్తులు విరాళాలు అందజేశ ఆలయ అభివృద్ధి లో భాగస్వాములై స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

సంపూర్ణ కార్తీక మహాపురాణం

(నిత్య పారాయణం)

ఇరువది అయిదవరోజు పారాయణము

ఏకోన వింశత్యధ్యాయః

పృథువు అడుగుతున్నాడు: 'నారదా! నీచే అత్యద్భుతంగా చెప్పబడిన తులసీ మహాత్మ్యాన్ని విని ధన్యుడనైనాను. అదే విధంగా కార్తీక వ్రతాచరణా ఫలితాలను కూడా ఎంతో చక్కగా చెప్పావు. అయితే, గతంలో ఈ వ్రతం ఎవరెవరి చేత ఎలా ఆచరించబడిందో కూడా విస్తరంగా తెలియజేయి' అని కోరగానే, నారదుడిలా వినిపించసాగాడు.

ధర్మదత్తోపాఖ్యానము

చాలా కాలం పూర్వం సహ్య పర్వతభూమిని కరవీరమనే ఊరుండేది. ఆ ఊళ్లో ధర్మవేత్త, నిరంతర హరి పూజాసక్తుడు, నిత్య ద్వాదశాక్షరీ జపవ్రతుడు అతిథి సేవాపరాయణుడూమైన ధర్మదత్తుడనే బ్రాహ్మణుడు వుండేవాడు.

ఒకానొక కార్తీక మాసంలో ఆ విప్రుడు విష్ణుజాగరణ చేయదలచిన వాడై తెల్లవారు ఝామునే లేచి పూజోపకరణాలు సమకూర్చుకుని విష్ణాలయానికి బయలుదేరాడు. ఆ దారిలో వంకరలు తిరిగి ఘోర దంష్ట్రలూ, పాటిస్తూన్న నాలుకా, ఎర్రటికళ్లు, దళసరిపాటి పెదాలూ, మాంసరహితమయిన శరీరమూ గలదీ, వందివలె ఘర్జిస్తున్నదీ అయిన ఒక దిగంబర రాక్షసి తారసపడింది. దానిని చూసి భీతి చెందిన ఆ బ్రాహ్మణుడు హరిస్మరణతో తులసీభరితమైన జలతాడనం చేయడం వలన, ఆ నీళ్లు సాకగానే ధాని పాపాలన్నీ పటాపంచలై పోతాయి. తద్వారా ఏర్పడిన జ్ఞానం వలన 'కలహ' అనబడే ఆ రాక్షసి ఆ బ్రాహ్మణునకు సాష్టాంగంగా ప్రణమిల్లి తన పూర్వ జన్మ కర్మ విపాకాన్నిలా విన్నవించసాగింది. 'కలహ' చెబుతోంది- పుణ్యమూర్తివైన ఓ బ్రాహ్మణుడా! పూర్వములో నేను సౌరాష్ట్ర దేశమందలి భిక్షుడనే బ్రాహ్మణుని భార్యను. అప్పుడు మిక్కిలి కలినురాలినై వుంటూ కలహ అనే పేరుతో పిలువబడే దానిని. నేనేనాయా నా భర్త ఆజ్ఞలను పాటించి ఎరుగను. ఆయన హితవును ఆలకించేదానిని గాను. నేనలా కలహకారిణై అహంకరించి వుండటం వలన కొన్నాళ్లకు, నాభుని మనసు విరిగి మారుమనువాడాలనే కోరికతో వుండేవాడు. ఆయనను నేను సుఖ పెట్టలేకపోయినా, మారు మనువు చేసుకోవాలనే ఆయన కోరికను గుర్తించి, భరించలేక విషం తాగి చనిపోయాను.

యమదూతలు నన్ను తీసుకు వెళ్లి యముడి ముందు నిలబెట్టారు. యముడు చిత్రగుప్తుడిని చూసి, 'చిత్రగుప్తా! దీని కర్మకాండలను తెలియజేయి. శుభమైనవా, అశుభమైనవా నరే, కర్మఫలాన్ని అనుభవించవలసినదే'నన్నాడు. అందు మీదట చిత్రగుప్తుడు, ఓ ధర్మరాజా! ఇది ఒక మంచి పని కూడా చేయలేదు. తాను షడ్రసోపేతంగా భోజనం చేసిన తరువాత కూడా, భర్తకు అన్నము పెట్టేది కాదు. అందువల్ల మేక జన్మమెత్తి బాధిష్టయగు గాక! నిత్యమూ భర్తతో కలహించి అతని మనసుకు బాధ కలిగించినందుకు గాను పురుగై పుట్టుగాక! వండిన వంటను తానొక్కతే తినిన పాపానికిగాను ఏల్గిగా పుట్టి తన ఏల్లలను తనే తినుగాక! భర్తుద్వేషిణీయై ఆత్మహత్య చేసుకున్నందు వలన అత్యంత నిందితమైన ప్రేత శరీరాన్ని పొందుగాక! ఇది ప్రేతరూపమును పొంది కొన్నాళ్లు నిర్జల స్థానంలో వుండి, అనంతరం, సత్కార్యముల నాచరించుగాక!' అని తీర్మానించాడు.

అది మొదలుగా ఓ ధర్మదత్తా! నేను అయిదువందల సంవత్సరాల పాటు ఈ ప్రేత శరీరం ధరించి ఆకలి దప్పులతో అల్లాడుతూ అలనాటి నా పాపాలకై దుఃఖిస్తున్నాను. అనంతరం కృష్ణా, సరస్వతి సంగమ స్థానమైన దక్షిణ దేశానికి రాగా అక్కడి శివగణాలు నన్ను తరిమికొట్టగా ఇలా వచ్చాను. పరమ పావనమైన తులసీ జలాలతో నీవు తాడించడం వలన ఈపాట పూర్వస్మృతి కలిగింది. పుణ్యతేజస్వివైన నీ దర్శనం లభించింది. కాబట్టి కళంకరహితుడవైన భూసురుడా! ఈ ప్రేత శరీరం నుంచీ, దీని తదుపరి ఎత్తవలసిన యోనులలోని జన్మ త్రయాన్నుంచీ, నాకెలా ముక్తి లభిస్తుందో చెప్పి రక్షించు - అని ప్రాధేయపడింది. కలహ చెప్పినదంతా విని కలతపడిన మనస్సు గలవాడైన ఆ విప్రుడు సుదీర్ఘ సమయం యోచించి, యోచించి దుఃఖభార హృదయుడై ఇలా చెప్పసాగాడు.

వింశత్యధ్యాయము

ధర్మదత్తుడు చెబుతున్నాడు: 'ఓ కలహ! తీర్థాలూ, దానాలు వ్రతాలూ చేయడం వలన పాపాలు నశించిపోతాయి. కాని నీ ప్రేత శరీరం వలన వాటిని ఆచరించేందుకు నీకు అధికారం లేదు. అదీగాక మూడు యోనులలో మూడు జన్మలలో అనుభవించ వలసిన కర్మపరిపాకం స్వల్ప పుణ్యాలతో తీరదు. అందువలన నేను పుట్టి బుద్ధెరిగిన నాటి నుండి ఆచరిస్తూ వున్న కార్తీక వ్రత పుణ్యంలో సగభాగాన్ని నీకు ధారపోస్తాను. తద్వారా నీవు తరించి ముక్తిని పొందు.' ఈ విధంగా చెప్పి ద్వాదశాక్షరీ మంత్రయుక్తంగా తులసీతోయాలతో అమెనభిషేకించి, కార్తీక వ్రత పుణ్యాన్ని ధారపోశాడు. ఉత్తరక్షణంలోనే కలహ-ప్రేత శరీరాన్ని విడిచి, దివ్యరూపిణియై, అగ్నిశిఖవలె లక్ష్మీకళతో ప్రకాశించింది. అమితానందంతో ఆమె ధర్మదత్తునికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుండగానే, విష్ణుస్వరూపులైన పార్షదులు ఆకాశం నుంచి విమానంతో సహా వచ్చారు. వారిలోని పుణ్యశీల, సుశీల అనే ద్వారపాలకుల చేత కలహ విమానమందాసీనగా, చేయబడి అప్సరోగణాల చేత సేవించబడసాగింది. ఆ విమానాన్ని చూస్తూనే అందులోని విష్ణుగణాలకు సాష్టాంగదండాలు ధర్మదత్తుడు. సుశీలా పుణ్యశీలులిద్దరూ అతనిని లేవదీసి, సంతసం కలిగించే విధంగా ఇలా చెప్పసాగారు.

'ఓ విష్ణుభక్తా! దీనుల యందు దయాబుద్ధి గలవాడవూ, ధర్మవిదుడవూ, విష్ణుభక్తుడవూ, అయిన నీవు అత్యంత యోగ్యుడవు. లోకోత్తరమైన కార్తీక వ్రత పుణ్యాన్ని ఒక దీనురాలి కోసం త్యాగం చేయడం వలన నీ నూరు జన్మలలోని పాపాలు యావత్తూ సర్వనాశనమై పోయాయి. ఈమె పూర్వ సంచితమంతా నీచే చేయించబడిన స్నానఫలం వలన తొలగిపోయింది. విష్ణుజాగరణ ఫలంగా విమానం తేబడింది. నీవామెకు అర్పించిన దీపదాన పుణ్యం వలన తేజోరూపాన్ని తులసీ పూజాదుల వలన విష్ణు సాన్నిధ్యాన్ని ఆమె పొందబోతోంది. ఓ పవిత్ర చరిత్రుడా! మానవులకు మాధవ సేవ వలన కలుగని మనోవాంఛిత మంటూ యేదీ లేదు. విష్ణుధ్యాన తత్పరుడవైన నీవు ఇద్దరు భార్యలతోనూ కలసి అనేక వేల సంవత్సరాలపాటు విష్ణు సాన్నిధ్యంలో వినోదించగలవు.

ధర్మదత్తునికి విష్ణుదూతల వరం

విష్ణుదూతలు చెబుతున్నారు: ఓ ధర్మదత్తుడా! వైకుంఠంలో నీ పుణ్యఫలాను భవానంతరం తిరిగి భూలోకంలోని సూర్యవంశంలో దశరథుడనే మహారాజుగా పుడతావు. నీ భార్యలిద్దరూ ఆ జన్మలో కూడా నీకు భార్యలవుతారు. ఇప్పుడు నీచే పుణ్యాభిషిక్తయైన ఈ 'కలహ' యే నీకా జన్మలో మూడవ భార్యగా వరిణమిస్తుంది. దివ్యకార్యార్థయై భూమిని అవతరించనున్న విష్ణువు ఆ పుట్టుకలో నీ కుమారుడుగా జన్మిస్తాడు. ఓ ధాతీ సురవరేణ్యా! విష్ణువునకు అత్యంత ప్రీతికరమైన ఈ కార్తీక వ్రతంతో సమానమయిన యజ్ఞయాగాదులుగాని, దానతీర్థాలుగాని లేవని తెలుసుకో. అంతటి మహాత్మ్యస్థమైనదీ, నీచే ఆచరించబడినదీయైన ఈ కార్తీక వ్రతంలోని కేవలం నగభాగపు పుణ్యానికే ఈ స్త్రీ విష్ణులోకాన్ని పొందుతూ వుంది. ఆమెను ఉద్ధరించాలనే నీ సంకల్పం నెరవేరింది గనుక, నీవు దిగులుడుగవయ్యా అన్నారు విష్ణుదూతలు.

పండొమ్మిదీ, ఇరువదీ- అధ్యాయములు

ఇరువది అయిదవ (బహుళ దశమి) రోజు

పారాయణము సమాప్తము

వర్షాకాలం ఈ 'టీ' తాగండి

వర్షాకాలం అంటే చాలామంది ఇష్టపడుతుంటారు. చల్ల చల్లని వాతావరణం, చిరుజల్లులు పడుతుంటే.. హాట్‌హాట్ స్నాక్స్ తింటూ.. వెదర్ ఎంజాయ్ చేస్తారు. కానీ ఈ వర్షాకాలం.. కూల్ ..కూల్ వాతావరణాన్నే కాదు.. ఎన్నో రోగాలను వెంట తీసుకొస్తుంది. ఈ కాలంలో అంటు వ్యాధులు, జలుబు, దగ్గు, మలేరియా, డెంగ్యూ, కడుపు ఇన్ఫెక్షన్, జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, న్యుమోనియా వంటి వ్యాధులు సర్వ సాధారణం. ఈ వ్యాధులకు దూరంగా ఉండాలంటే, వర్షాకాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కాలంలో సాధారణ రోజుల్లో కంటే మనం ఇంకాస్త జాగ్రత్తగా ఉండాలి. ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ కాలంలో సమతుల్య ఆహారం, వేడివేడి ఆహారం తీసుకోమని సూచిస్తున్నారు. అలాగే ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న, పానీయాలు తీసుకోమని సిఫార్సు చేస్తున్నారు.

శొంఠి, ధనియాల టీ.. శొంఠిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఎండబెట్టిన అల్లాన్నే శొంఠి అని పిలుస్తారు. ఇది శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది. శొంఠి టీ శరీరానికి మెడిసిన్‌లా పని చేస్తుందని డా. ఐశ్వర్య అన్నారు. వర్షాకలంలో శరీరాన్ని లోపల వేడిగా ఉంచుతుందని అన్నారు. వర్షాకాలంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉంటుంది. శొంఠి జీర్ణసంబంధ సమస్యలకు చెక్ పెడుతుంది. ఈ టీ తాగితే, జలుబు, ఛాతీ వద్ద కఫం వంటి సమస్యలు రావు. శొంఠి టీ తీసుకుంటే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. దీనిలోని యాంటీఫంగల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్స్‌తో పోరాడతాయి. ఎముకలు, కండరాల ఆరోగ్యానికి మంచిది.

. శొంఠి పొడి - 1 tsp, ధనియాలు - 1 tsp, నల్ల మిరియాలు - 1 స్పూన్, జీలకర్ర పొడి - 2 స్పూన్, బెల్లం, నీళ్లు - 3 కప్పులు, ఎలా తయారు చేయాలి..

టీ తయారు చేయడానికి, ఈ పదార్థాలన్నింటినీ కలిపి నీటిలో 15 నిమిషాలు మరగబెట్టండి. తర్వాత దాన్ని ఫిల్టర్ చేసి టీని ఎంజాయ్ చేయండి.

తులసి-నిమ్మకాయ టీ..

తులసి, నిమ్మరసంలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఈ టీ తాగితే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు. ఈ టీ వల్ల జలుబు, ముక్కు కారటం, ఫ్లూ వంటి ఇన్‌ఫెక్షన్లు దూరమవుతాయి. ఛాతీలో పేరుకుపోయిన కఫం కరుగుతుంది. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చినప్పుడు ఈ టీ తాగితే ఉపశమనం లభిస్తుంది. ఈ టీ తాగితే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది.

నీళ్లు - 3 కప్పు, తులసి ఆకులు - 1/2 కప్పు, నిమ్మరసం - 4 స్పూన్‌లు, ఇలా తయారు చేసుకోండి..

ఈ టీని తయారు చేసుకోవడానికి, తులసి ఆకులను 3 కప్పుల నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. దీన్ని వడగట్టి అందులో నిమ్మరసం కలుపుకుని తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

లిక్కోరైస్, పటిక బెల్లం.. లిక్కోరైస్, పటిక బెల్లం తో తయారు చేసే టీ.. వర్షాకాలంలో వేధించే గొంతు నొప్పికి దివ్యౌషదమని డా. ఐశ్వర్య అన్నారు. ఈ టీ తాగితే గొంతుకు సంబంధించి అన్ని సమస్యలు దూరమవుతాయని అన్నారు. దీంటో పాటు శరీరంలో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని అన్నారు.

. క్లోరైస్ పొడి - 3 tsp, పటిక బెల్లం- ఒకటిన్నర టీస్పూన్, నీరు - 3 కప్పులు ఇలా తయారు చేయండి..

ఈ టీని తయారు చేసుకోవడానికి, పటిక బెల్లం కరిగే వరకు నీటిలో మరగబెట్టాలి. ఆ తర్వాత లిక్కోరైస్ పొడి వేసి 10 నిమిషాలు మరగనివ్వాలి.

పియర్స్ పండు రోజూ తింటే.. గుండె సమస్యలు రావు

వర్షాకాలంలో పియర్స్ ఎక్కువగా దొరుకుతుంది. ఈ పండులో చాలా రకాలు ఉన్నాయి, కొన్ని ఏడాది పొడవునా దొరుకుతాయి. యాపిల్‌లా కనిపించే ఈ పండులో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ఫైబర్, ఫోలేట్, పాలీఫెనాల్ యాంటీఆక్సిడెంట్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పియర్స్ రోజూ తింటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు అంటున్నారు. పియర్స్‌లో ఉండే.. పోషకాలు అధిక కొలెస్ట్రాల్, మలబద్ధకం, డయాబెటిస్, గుండె సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి రక్షిస్తాయి. ఈ పండ్లలోని విటమిన్ సీ, ఏ వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. 100 గ్రాముల పియర్స్ పండులో 57 కేలరీలు, 15 గ్రాముల పిండి పదార్థం (కార్బోహైడ్రేట్స్), 0.1 గ్రాముల ఫ్యాట్, 0.4 గ్రాముల ప్రొటీన్, 3.1 గ్రాముల డైటరీ ఫైబర్ ఉంటుంది.

పియర్స్‌లో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో గుణాలు ఉన్నాయని అన్నారు.

కొలెస్ట్రాల్ కరుగుతుంది.. పియర్స్‌లో పెక్టిన్ అనే కాంపౌండ్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎల్‌డిఎల్, ట్రైగ్లిజరైడ్స్, విఎల్‌డిఎల్ స్థాయిలను తగ్గిస్తుంది రోజూ పియర్స్ తింటే అధిక కొలెస్ట్రాల్ ప్రమాదం తగ్గుతుంది.

మలబద్ధకం తగ్గుతుంది.. పియర్స్‌లో ఉండే పెక్టిన్ కారణంగా.. మలబద్ధకానికి ఔషదంలా పనిచేస్తుంది. పెక్టిన్ ఒక రకమైన ఫైబర్, ఇది జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు సహాయపడుతుంది.

షుగర్ పేషెంట్స్‌కు మంచిది.. పియర్స్‌లో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉన్నాయి. ఈ పండు డయాబెటిక్ పేషెంట్స్‌కు మేలు చేస్తుంది.మీరు డయాబెటిక్ పేషెంట్ అయితే, ప్రతిరోజూ పియర్స్ తింటే.. మీ బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది, ఇది షుగర్ పేషెంట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.

క్యాన్సర్‌కు చెక్.. పియర్స్ రోజూ తింటే.. మూత్రాశయం, ఊపిరితిత్తులు, ఆహార పైపులలో క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించవచ్చు. పియర్స్‌లో ఉర్సోలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది ఆరోమాటేస్ చర్యను నిరోధిస్తుంది, తద్వారా క్యాన్సర్‌ను నివారిస్తుంది. ఈ పండ్లలో ఉండే ఐసోక్వెర్సిట్రిన్ డీఎన్‌ఎను ఆరోగ్యంగా ఉంచుతుంది. పియర్స్ పండు యాంటీ-కార్సినోజెనిక్ ప్రక్రియ చేపడుతుంది. అలాగే మృతకణాలను తొలగించి, కొత్త కణాల్ని అభివృద్ధి చేస్తాయి.

బరువు తగ్గుతారు.. ఈ పండ్లలో తక్కువ మొత్తంలో కేలరీలు ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు తప్పకుండా దీనిని డైట్‌లో చేర్చుకుంటే మంచిది.

గుండెకు మేలు.. పియర్స్ పండ్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని చాలా అధ్యయనాలు పేర్కొన్నాయి. రోజు పియర్స్ తింటే గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. ఏటిలో పొటాషియం గుండెకు మేలు చేస్తుంది.

గాయాలు తగ్గతాయి.. ఈ పండ్లలోని విటమిన్ సీ... గాయాలను తగ్గిస్తుంది. కణాలను సరిచేస్తుంది. కాలిన, తెగిన, గీసుకుపోయిన గాయాలను త్వరగా నయం చేస్తుంది.

రక్తం తక్కువగా ఉన్నవారు, బలహీనంగా, నీరసంగా ఉండేవారు ఈ పండ్లను తింటే మంచి. వీటిలోని ఐరన్, కాపర్ శరీరానికి బలాన్ని ఇస్తాయి. ఎర్రరక్త కణాల సంఖ్యను పెంచుతాయి.

ఈ పండులో రాగి, కాల్షియం, ఫాస్పరస్, మాంగనీస్, మెగ్నీషియం ఉంటాయి. ఇవి మన ఎముకల్ని బలంగా చేస్తాయి.

ఆలివ్స్ గుండెకు మేలు చేస్తాయి

ఆరోగ్యకరమైన ఆహారం నేటి పరిస్థితిలో చాలా ముఖ్యం. చిన్న వయసులోనే చాలా మంది ఎన్నో ఆరోగ్య సమస్యలకి గురవుతున్నారు. వాటన్నింటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే కచ్చితంగా హెల్తీ డైట్ పాటించాలి. అందులో భాగంగానే కొన్ని ఆహార పదార్థాలను మీ డైట్‌లో చేర్చుకోవాలి. అందులో బాగంగానే ఆలివ్స్ తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చూద్దాం.

గుండెకి మేలు చేసే ఆలివ్స్.. నేడు చాలా మంది గుండె సమస్యల కారణంగా తనువు చాలిస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ సమస్యలు పెరిగిపోతున్నాయి. అందుకే ముందునుంచి జాగ్రత్తగా ఉండడం చాలా ముఖ్యం. అధికంగా కొలెస్ట్రాల్, బీపి కారణంగా గుండె సమస్యలు వస్తాయి. వీటిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. శారీరక శ్రమ, ఒత్తిడిని దూరం చేయడం వంటి వాటి వల్ల వీటిని నివారించొచ్చు. అదే విధంగా ఆరోగ్యకరమైన ఆహారం తినడం ముఖ్యం. అందులో భాగంగానే ఆలివ్స్ రెగ్యులర్‌గా తినాలంటున్నారు నిపుణులు. ఒలిక్ యాసిడ్, ఆలివ్‌లలోని ప్రధాన కొవ్వు ఆమ్లం. ఇది గుండెకి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తుంది. మరియు చెడు కొలెస్ట్రాలని ఆక్సీకరణం నుండి కాపాడుతుంది.

ఆకలిని నియంత్రించే శక్తి ఆలివ్స్‌కి ఉంటుంది. ఆలివ్స్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణక్రియని నెమ్మదిస్తాయి. కోలిసిస్టొకినిన్ అనే హార్మోన్‌ని ప్రేరేపిస్తాయి. ఇది మెదడుకు కడుపు నిండిందనే భావనని ఇస్తుంది. దీని కారణంగా ఆహారం ఎక్కువగా తీసుకోం. బరువు తగ్గాలనుకునేవారు ఈ ఆలివ్స్‌ని రెగ్యులర్‌గా తింటే మంచి ఫలితాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

స్కిన్ ప్రొబ్లమ్స్.. ఆలివ్స్.. టోకోఫెరోల్స్ అంటే విటమిన్ ఈ, టోకోట్రినాల్స్‌కి గొప్ప మూలం. ఇది కణాల పనితీరు, రోగ నిరోధక వ్యవస్థ, చర్మ ఆరోగ్యాన్ని కాపాడేందుకు తోడ్పడు తుంది. విటమిన్ ఈ అతినీలలోహిత వికిరణం నుండి చర్మాన్ని రక్షించడానికి ఏర్పడింది. కాబట్టి చర్మ కాన్సర్, అకాల వృద్ధాప్యం నుండి రక్షించడంలో సాయపడుతుంది. అంతేకా కుండా చర్మంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవు తాయి. చర్మం అందంగా మెరుస్తూ కనిపిస్తుంది. ఈ కారణం గా ఆలివ్ నూనె, ఆలివ్ బ్యూటీ ప్రొడక్ట్స్ చాలా ఫేమస్.

ఆర్థరైటిస్‌కి మంచులా.. ఆలివ్స్‌లో ఒలియోకాంతల్ అనే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఇన్‌ఫ్లమేటరీ COX-1, COX-2 ఎంజైమ్స్ ఏర్పడకుండా నిరోధిస్తాయి. ఈ ఎంజైమ్స్ కీళ్ళనొప్పులు, టైప్ 2 డయాబెటిస్ వ్యాధులకు ముఖ్య కారణాలు. అందుకే వీటిని తినడం వల్ల కీళ్ళ నొప్పులు దూరమవుతాయి. అదే విధంగా డయాబెటిస్ కూడా దూరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇన్ని లాభాలు ఉన్న పండును మన డైట్లో చేర్చుకోవడం చాలా ముఖ్యం. మరింకెందుకు ఆలస్యం.

మధుమేహం ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి

కిడ్నీలు రక్త ప్రసరణ, శరీర పరిమాణం, రక్తపోటు స్థిరంగా ఉంచడానికి, రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి మరియు మలినాలను తొలగించడానికి సహాయపడతాయి. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ఇవన్నీ జరగాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ కిడ్నీలపై ఎక్కువ శ్రద్ధ వహించాలి.

ఇన్సులిన్ ఉత్పత్తి ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేని మధుమేహం రకాలు, టైప్ 1 డయాబెటిస్ ఉన్నవారిలో 30 శాతం మంది మరియు టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో 10 నుండి 40 శాతం మంది, తగినంత ఇన్సులిన్ ప్రవేంచని వారు మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్నారు.

మూత్రపిండాల వైఫల్యం యొక్క లక్షణాలు మూత్రపిండాల రుగ్మత సంభవిస్తే బరువు పెరుగుట చీలమండ వాపు. రాత్రిపూట తరచుగా మూత్రవిసర్జన. అధిక రక్త పోటు. మీకు మధుమేహం ఉంటే, మీరు కనీసం సంవత్సరానికి ఒకసారి రక్తం, మూత్రం మరియు రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. తద్వారా వ్యాధిని ప్రారంభిక దశలోనే నియంత్రించవచ్చు.

రక్తంలో చక్కెర నియంత్రణ మధుమేహాన్ని అదుపులో



ఉంచుకోవడం వల్ల కిడ్నీ వ్యాధి తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రంలో అల్బుమిన్ అధిక స్థాయిలో ఉండటం కిడ్నీ వ్యాధికి సంకేతం. మూత్రపిండాల వ్యాధిని పరీక్షించడానికి వైద్యులు నిర్ణయించడానికి చాలా రోజుల ముందు ఇది మూత్రంలో విసర్జించబడుతుంది. అందువల్ల, మధుమేహం ఉన్నవారు ఈ పరీక్షను ఏటా చేయించుకోవాలి.

ప్రమాద సంకేతం మధుమేహం నియంత్రణలో ఉన్న వ్యక్తి రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా రోజురోజుకు తగ్గిపోతే, అది కిడ్నీ రుగ్మతకు సంకేతం కావచ్చు. మధుమేహం ఉన్నవారు గుర్తించబడని పునరావృత హైపోగ్లైసీమియాకు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి క్రమం తప్పకుండా కిడ్నీ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి.

ఏం చేయాలి? ప్రారంభ సంకేతాలను గమనించడం ద్వారా, తక్కువ రక్తంలో చక్కెర స్థాయిలను సరిగ్గా నిర్వహించవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి గ్లూకోజ్ మాత్రలు తీసుకోవడం స్వల్పకాలిక పరిష్కారాలు. చికిత్స చేయని డయాబెటిక్ హైపోగ్లైసీమియా మూర్ఛలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం మరియు అత్యవసర చికిత్స అవసరమయ్యే ప్రాణాంతక పరిస్థితికి దారి తీస్తుంది.

మౌత్ వాష్ వల్ల చుండ్రు పూర్తిగా పోతుంది



మౌత్ వాష్ లో యాంటీ ఫంగల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టు రాలే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. అంటే ఫంగల్ ఇన్ఫెక్షన్లను నాశనం చేసే సామర్థ్యం దీనికి ఎక్కువ.

దానితో పాటు, జుట్టు ఆరోగ్యంగా మరియు తలనొప్పి లేకుండా ఉంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మౌత్ వాష్ బ్యాక్టీరియాను చంపడానికి ఉద్దేశించబడింది.

చుండ్రు చాలా మంది చుండ్రుతో బాధపడుతున్నారు. చుండ్రు మీ నెత్తిమీద దురద మొదలవుతుంది, ఇది బహిరంగంగా మీకు అసౌకర్యంగా అనిపిస్తుంది. చుండ్రు సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు చాలా షాంపూలను ఉపయోగిస్తారు. ఈ షాంపూ కొన్నిసార్లు జుట్టు రాలడానికి కారణమవుతుంది.

ఉపయోగించండం మౌత్‌వాష్‌లో అస్ట్రింజెంట్ గుణాలు ఉన్నాయి, ఇది జుట్టు రాలడం సమస్యలకు సహాయపడుతుంది. ఇది శిరోజాలను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో మిథైల్, మిథైల్ సాలిసైలేట్ ఉంటాయి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ యాంటిసెప్టిక్ లక్షణాలను కలిగి ఉంది. ఇది శిరోజాలను చల్లబరుస్తుంది మరియు చుండ్రు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది.

మౌత్‌వాష్‌ని ఉపయోగించి చుండ్రుని ఎలా వదిలించుకోవాలో చూద్దాం: - మౌత్ వాష్ మరియు నీరు - బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ - మౌత్ వాష్ మరియు ఆపిల్ సైడర్ వెనిగర్

మౌత్ వాష్ మరియు నీరు మౌత్‌వాష్‌లో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటిసెప్టిక్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి నెత్తిమీద దురద నుండి ఉపశమనం మరియు చుండ్రును నయం చేయడంలో సహాయపడతాయి.

ఉపయోగ విధానం ముందుగా 2 టీస్పూన్ల మౌత్ వాష్ కు 2 టీస్పూన్ల నీరు కలపండి. తర్వాత స్ప్రే బాటిల్‌లో పోయాలి. దీని కోసం, ముందుగా మీ జుట్టును షాంపూతో కడగాలి మరియు కండిషన్ చేయండి. తర్వాత ఈ స్ప్రేని స్కాల్ప్ పై స్ప్రే చేసి కాసేపు అలాగే ఉంచుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో మీ తలని శుభ్రం చేసుకోండి.

బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ దరభాస్తు యొక్క ఈ పద్ధతి పొడి మరియు కఠినమైన జుట్టు ఉన్నవారికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే బేబీ ఆయిల్ మరియు మౌత్ వాష్ ఉపయోగించడం వల్ల మీ జుట్టు పొడిబారదు.

ఉపయోగ విధానం ముందుగా 2 టీస్పూన్ల బేబీ ఆయిల్ను 2 టీస్పూన్ల మౌత్ వాష్ కు కలపండి. అప్పుడు మీ జుట్టును షాంపూతో కడగాలి. మీరు కండీషనర్ ఉపయోగించకూడదని గమనించండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 5 నిమిషాల పాటు మసాజ్ చేయండి. అప్పుడు మీ జుట్టును షాంపూతో కడగాలి.

మౌత్ వాష్ ఇది స్కాల్ప్‌ను రిలాక్స్ చేసి చుండ్రు సమస్యను దూరం చేస్తుంది. ఉపయోగ విధానం: 1 టీస్పూన్ మౌత్ వాష్ మరియు కాటన్/స్పాంజ్ తీసుకోండి. మౌత్‌వాష్‌లో స్పాంజ్‌ని ముంచి మీ తలపై రుద్దండి. 5-10 నిమిషాల తర్వాత షాంపూతో జుట్టును బాగా కడగాలి.

ఉపయోగ విధానం: 2 టేబుల్ స్పూన్ల మౌత్ వాష్, 2 టేబుల్ స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్, 2 టేబుల్ స్పూన్ల నీరు మరియు 1 కప్పు నీటిని స్ప్రే బాటిల్‌లో కలపండి. జుట్టును షాంపూతో శుభ్రంగా కడిగి, ఆపై కండీషనర్ రాయండి. తర్వాత ఈ స్ప్రేని మీ తలపై స్ప్రే చేయండి. ఆ తర్వాత, ఆపిల్ సైడర్ వెనిగర్‌ను నీటితో కలిపి, మీ జుట్టును కడగాలి. ఈ ఆర్టికల్ సహాయంతో, మీరు మౌత్ వాష్ ఉపయోగించి చుండ్రు సమస్యను సులభంగా ఎదుర్కోవచ్చని మేము నమ్ముతున్నాము.

యోగా ఉదయం పూట చేయడం మంచిదేనా..!

యోగా మనసును ప్రశాంతంగా చేసే ఓ సాధన. మారుతున్న జీవన శైలి కారణంగా చాలా మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అయితే ఈ సమస్యల నుంచి విముక్తి పొందడానికి యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా కొందరు ప్రతి రోజూ యోగా చేసి అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారిని పలు నివేదికలు తెలిపాయి. ఇది శరీరానికి బలాన్నిఇవ్వడమే కాకుండా.. మనస్సు ఏకాగ్రతను పెంచుతుంది. యోగాలో చేసే సాధనను యోగాసనాలు అని పిలుస్తారు. వీటిని క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీరం దృఢంగా అవ్వడమే కాకుండా అనేక రకాల శరీర సమస్యలు దూరమవుతాయని యోగా నిపుణులు తెలుపుతున్నారు.

యోగాను ప్రతిరోజూ చేయడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర శక్తి పెరగడమేకాకుండా.. భావోద్వేగాలు తగ్గుతాయని నిపుణులు పేర్కొన్నారు. అంతేకాకుండా మానసిక ఆరోగ్యం మెరుగుపడి బాడీ ఫిట్‌గా మారుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు. కానీ యోగాను చాలా మంది చేయ కూడని సమయాల్లో చేస్తున్నారు ఇలా చేయడం వల్ల దీని ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందలేకపోతున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

యోగాను చేసే ముందు ఈ నియమాలు తప్పకుండా పాటించాలి:

ఉదయం పూట యోగా చేయడం చాలా మేలు: యోగా చేయడానికి సరైన సమయం ఉదయమని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ ఉదయం టిఫిన్ తినే ముందు యోగా సాధన చేయాలని పలు హెల్త్ నివేదికలు పేర్కొన్నాయి. సాధన చేసే క్రమంలో కడుపు తేలికగా, ఖాళీగా ఉండటం మంచిదని నిపుణులు తెలుపుతున్నారు.

యోగా చేస్తున్నప్పుడు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి: యోగా చేసే క్రమంలో సాధన కోసం కొంత సమయాన్ని కేటాయించండి. తద్వారా యోగా చేసేటప్పుడు మనస్సు ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా ఉంటుంది. అంతేకాకుండా శరీరాన్ని ప్రశాంత స్థితిలో ఉంచడం అవసరమని యోగా నిపుణులు పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళులు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక రింగురోడ్డు లక్ష్మీనారాయణ నగర్‌లో గల డీఏఆర్ క్యాంపు కార్యాలయంలో వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి జీపీఎంసీ 80వ వార్డు వైసీపీ ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుడు రేబాక మధుబాబు, రాష్ట్ర గవర్నమెంట్ కాంట్రాక్టర్ సిలపరశెట్టి బాబీ, కటారి దేముడు, యల్లపు శ్రీనివాస్(వైఎస్) పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కొణతాల భాస్కరరావు, రేబాక మధుబాబు, కటారి దేముడు మాట్లాడుతూ నవ భారత నిర్మాణానికి రాజ్యాంగాన్ని రచించి దేశంలో అన్నివర్గాలవారు, అన్ని కులాల వారికి ఎంతో మేలు చేశారన్నారు. నేడు మనదేశం ప్రపంచ దేశాల్లో ఆర్థికంగా బలపడి ఉందంటే దానికి మూల కారణం అంబేద్కర్ అన్నారు. రిజర్వేషన్లతో పాటు పొరులకు అనేక హక్కులు కల్పిస్తూ ఆయన రూపొందించిన రాజ్యాంగం వలనే మనమంతా ఈరోజు హక్కులను వినియోగించుకుంటూ స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేబాక ఇంద్రకుమార్, బండి రాజాబాబు, కోన కృష్ణ, కాంట్రేగుల దేవ, కొణతాల సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో స్థానిక భీమునిగుమ్మం వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకుడు కటారి దేముడు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. వార్డు మెంబరు నుంచి పార్లమెంట్ సభ్యుడు వరకు అన్నివర్గాల వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే అది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే కారణమని కటారి దేముడు పేర్కొన్నారు. అబ్బుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, యల్లపు శ్రీనివాస్, బండి రాజాబాబు, పాట్ల పూర్ణచంద్రరావు, తెరపల్లి మణి, కందలాడ సాయి, బండి రాజాబాబు, దుప్పాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక విజయరామరాజు పేట ఏఎంసి కాలనీలో బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్67వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.

స్థానిక టిడిపి నాయకులు పిట్ల రాజు, ఎస్. భాను చందర్ (అఖి), బొమ్మల దేవి, చెక్క నూకరాజు ఆధ్వర్యంలోనిర్వహించినఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ళ సురేంద్ర విచ్చేసి అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారని , ప్రతి పౌరునికి రాజ్యాంగం ద్వారా రక్షణ కల్పించారు అన్నారు దేశానికి, బడుగు,బలహీన వర్గాలు, అట్టడుగు వర్గాలకు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, వారికి ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు , శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా ఆయన ఆశయాలను అమలు చేసి చూపించారు అన్నారు.ఈ కార్యక్రమంలో 82వ డివిజన్ ఇంచార్జ్ పాలారపు త్రినాథ్, ఆళ్ల రామచంద్రరావు, దాడి జగన్, బెల్లన శ్రీనివాసరావు పల్లా సత్యం అప్పారావు, ఆకుల నానాజి, పైలా గోపి, కోయిలాడ గణేష్, వేగి కృష్ణ, పండు, రాజి, శాంతి, కాలనీ జై భీమ్ కమిటీ సభ్యులు కటారి నూకరాజు, కటారి సంగిరెడ్డి, రాజాబాబు, శీను, మరియు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఔన్నత్యం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రతి ఒక్కరికీ వారి జీవితంలో జరిగే జన్మదిన వేడుకలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుందని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) వెల్లడించారు. వ్యక్తిగత సహాయకుడు సతీష్ కుమార్ జన్మదిన వేడుక పట్టణంలోని నర్సింగరావుపేట ఎం వి ఆర్ ప్రధాన కార్యాలయం నందు సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తనయుడు సతీష్ బాబు(సంజూ బాబు) తో కలిపి ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఏఏ సతీష్ కుమార్ చేత కేక్ కట్ చేయించి అందరికి పెంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తన చారిటబుల్ ట్రస్ట్ యొక్క విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏఏ సతీష్ కుమార్ అహర్నిశలు కష్టపడుతున్నార న్నారు. ఇలాంటి వారు నా అనుచరులుగా ఉండడం నా అదృష్టమని అన్నారు. ప్రజా సేవ కొరకు నాలాగే ఆలోచిస్తున్న ఏఏ సతీష్ కుమార్ కు నా యొక్క అభినందనలన్నారు. అనంతరం ఏఏ సతీష్ కుమార్ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి సరదాగా ఎం.వి.ఆర్ గడిపారు. తనపై ఉన్న నమ్మకంతో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తున్న ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కు ప్రధాన అర్థనైజర్ గా నియమించి, బాధ్యతలు అప్ప గించిన ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు కు ఈ మేరకు సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఏ సతీష్ కుమార్ కుటుంబ సభ్యులతో పాటు కార్యాలయ సిబ్బంది, ఎం వి ఆర్ యువసేన సభ్యులు, సంజూ బాబు టీం తదితరులు పాల్గొన్నారు.

దేశానికే దార్శనికుడు బి.ఆర్.అంబేద్కర్

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతీయ సమాజానికి దార్శనికుడని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కొనియాడారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యావేత్తగా రాజ్యాంగ నిర్మాతగా, న్యాయవాదిగా, సామాజిక సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన పేరుగాంచారన్నారు. రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చరిత్ర లో పదిలంగా ఉంటుందన్నారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అన్నారు. సమస్యలను ఎదిరించాలంటే చదువొక్కటే మార్గమని భావించారన్నారు. స్వాతంత్ర భారతానికి తొలి న్యాయశాఖ మంత్రి గా అమూల్యమైన సేవలు అందించారని అంబేద్కర్ కలలు కన్న సమ సమాజ నిర్మాణానికి మన వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డిఆర్ఓ బి. దయానిధి, సిపిఓ జి రామారావు, సోషల్ వెల్ఫేర్ డిడి అజయ్ బాబు, డివిఎంసి నెంబర్ బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జున్ అవార్డు గ్రహీత శ్రీజ ఒలింపిక్ లో స్వర్ణ పథకం సాధించాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అర్జున్ అవార్డు గ్రహీత, ఆకుల శ్రీజ తల్లిదండ్రులు ఆకుల ప్రవీణ్ కుమార్-సుధ లు అనకాపల్లి విచ్చేసిన సందర్భంగా గౌరీ సేవా సంఘం అయ్యప్ప స్వామి ఆలయ ఆశ్రమ మాలదారులు, గవర సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు బుద్ధ భూలోక నాయుడు నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, కొణతాల ఉమా , లోటస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విల్లూరి రాజేష్ , జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత కొణతాల పణి భూషణ్ శ్రీధర్, గ్రీన్ క్లబ్ సభ్యులు, స్వాగతం పలికి అయ్యప్పస్వామి ఆలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్, తదితరులు మాట్లాడుతూ అనకాపల్లి మూలాలు కలిగిన కుటుంబం నుండి అంతర్జాతీయ స్థాయికి టేబుల్ టెన్నిస్ క్రీడారంగంలో ఎదిగిన ' శ్రీజ" మన రాష్ట్రానికి దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చినందుకు అనకాపల్లి వాసులుగా మే అందరం ఎంతో గర్విస్తున్నామని, త్వరలోనే ఆకుల శ్రీజకు అనకాపల్లి లో ఘనంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. శ్రీజ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి త్వరలో జరుగు ఒలింపిక్స్ లో భారతదేశం తరపున బంగారు పతకం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల కృషి వెలకట్టలేమని శ్రీజ అర్జున అవార్డు అందుకోవడం పట్ల హర్షం వెలబుచ్చడమైనది. ఈ కార్యక్రమంలో కొణతాల ఉమామహేశ్వరరావు, స్వరూప రాణి, డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి,, పెంటకోట సురేష్ కుమార్, జగన్, దాడి బుజ్జిబీ బి సంతోష్, గంగాధర్, ఆళ్ల నాయుడు, నానాజి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం విశాఖ తూర్పు నియోజకవర్గం వైసీపీ క్యాంపు కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులు, ఇన్చార్జీలు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అంబెలి ఘటించారు.బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు నిరుపమానమని పాల్గొన్న కార్పొరేటర్లు వార్డ్ అధ్యక్షులు పార్టీ శ్రేణులు అన్నారు. భారత రాజ్యాంగ ప్రదాత, దేశ పాలనా మార్గదర్శకాల విధాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి నేడు అని,బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నిరుపమానం అన్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ ఏపీ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిలి ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అహర్నిశలూ కృషి చేస్తోంది.అని, బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అంటూ నివాదాలు చేశారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు,తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులు ఇన్చార్జిలు పార్టీ శ్రేణులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో తుఫాను సహాయక కార్యక్రమాలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ , వారి ఆదేశాల మేరకు తుఫాన్ ప్రభావం వలన జిల్లాలో భారీ వర్షాలకు నేలకూలిన చెట్లను జెసిబి లతో పోలీసులు తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రోడ్లపై ప్రవహిస్తున్న నీటి వలన ట్రాఫిక్ ను వేరే మార్గంలో మళ్ళించడం, నదులు డ్యాముల దిగువ నివసిస్తున్న ప్రజలకు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న జిల్లా పోలీసులు.ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు దిశా యాప్, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రాంబిల్లి మండలం వేలూరు గ్రామం కమ్యూనిటీ హాల్లో ఎస్సై దీనబంధుకు వచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది ఆడుతున్న వారిపై దాడి చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 9210 రూపాయలు స్వాధీను పంచుకున్నారు.

ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి ఎంపీ గొర్లి సూరిబాబు కోరారు.జన జాతీయ గౌరవ దినోత్సవం 2023-వికాసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మార్టూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు ప్రజలతో మమేకమై వివరాలను వివరించాలని చెప్పారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే లబ్ది కోసం వాళ్ల మాటల్లోనే తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు,ఎంటిటీసి మిద్దె రాజా రామచంద్రరావు,వార్డు మెంబర్లు , జిల్లాస్థాయి అధికారులు,మండల స్థాయి అధికారులు , డిఎంహెచ్వో, ఎంపీడీవో, ఈఓపిఆర్డి,డాక్టర్లు ,ఏపీవో, ఎసిడిపిఓ,వ్యవసాయ అధికారులు,అన్ని శాఖలు మండల అధికారులు , ప్రజలు ,లబ్దిదారులు, వైఎస్ఆర్సిపి నాయకులు ,కార్యకర్తలు ,వాలంటీర్లు ,ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు ,పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా వుంటుంది

విజయనగరం: రాష్ట్రంలో మిగ్‌జాం తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని, వారికి అండగా నిలుస్తుందనే భరోసాను కల్పించాలని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. ఖరీఫ్ లో సాగుచేస్తున్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో చెప్పారు. పంటపొలాల్లో నీరు నిల్వ వున్నట్లయితే వర్షాలు తగ్గిన వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల వద్ద వున్న ధాన్యం వెంటనే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు అత్యంత త్వరగా పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అంటువ్యాధులకు అవకాశం లేకుండా అవసరమైన పారిశుద్ధ్య పనులు తక్షణం చేపట్టాలని ఆదేశించారు. తుఫాను బాధితులకు సహాయం అందించడంలో ఉదారంగా వ్యవహరించి మానవతా దృక్పథంతో సహాయం అందించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం.దీపిక పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత, ప్రకృతి వైపరీత్యాల యాజమాన్య సంస్థ డి.పి.ఎం. ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీ తర్వాత పంటనష్టాల అంచనా : జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో యీ సాయంత్రానికి వర్షం పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశం వుందని, వర్షం తగ్గినం వెంటనే ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వరి పంటను కాపాడేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సుమారు 1500 ఎకరాల్లో పంట కోతలు కోసి ఆయా పొలాల్లోనే పదిలిపెట్టారని, యీ పొలాల్లో వున్న వరి పంటను కాపాడేందుకు వీలుగా నిల్వ వున్న వర్షపు నీటిని తోడేందుకు వీలుగా సహాయాన్ని అందిస్తామని తెలిపారు. దీంతోపాటు మరో 400 ఎకరాల్లో కోతకు సిద్ధంగా వున్న పంట వుందని, దీనిని కాపాడే ప్రయత్నం చేస్తామన్నారు. పంటపొలాల్లో వర్షపు నీరు తగ్గిన తర్వాత డిసెంబరు 9 నుంచి పంటనష్టాలపై అంచనావేసే కార్యక్రమం చేపడతామన్నారు.

జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు పెద్ద ఎత్తున వర్షపాతం నమోదైనట్టు కలెక్టర్ వెల్లడించారు. సగటున అన్ని మండలాల్లో 9 మి.మీ.ల వర్షపాతం కురిసిందని, నెల్లిమర్ల, భోగాపురం, ఎస్.కోట మండలాల్లో ఒక సెంటీమీటరుపైనే వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. అయితే జిల్లాలో రోడ్లు, విద్యుత్ సరఫరాకు పెద్దగా అంతరాయం ఏమీ కలగలేదని పేర్కొన్నారు. తుఫాను కారణంగా ప్రాణనష్టం కాని, ఇళ్లు దెబ్బతినడం పంట ఘటనలు గానీ నమోదు కాలేదన్నారు.

హిమ గౌరీ అమర్నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నేతలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ సతీమణి హిమగౌరీ పుట్టినరోజు సందర్భంగా పలువురు మింది లో ఆమెను స్వయంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శాలువా బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ హిమ గౌరి చేత కేక్ కట్ చేయించారు. శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్, ఈఓ బందారు ప్రసాద్ ఆమెని శాలువతో సత్కరించి శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఫోటోను అందజేశారు. నూకాంబిక దేవస్థానం ధర్మకర్త పీలా శ్రీనివాసరావు, జిల్లా ఐటి వింగ్ సెక్రటరీ కొణతాల శ్యాంలు శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు సందీప్ శర్మ శ్రీ నూకాంబికా అమ్మవారి ఆశీర్వచనములు అందించారు.

బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడుగా పాపిటి రాజు నియామకం

పాడేరు, (విశాఖ సమాచారమ్): పాడేరు మొదమాంబ ఆడిటోరియంలో జరిగిన బీజేపీ మైనారిటీ మోర్చా కార్యక్రమంలో బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గా పాపిటి రాజు ని అల్లూరి సీతారామరాజు జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గా నియామకం చేసినట్టు జిల్లా అధ్యక్షులు పాంగి రాజారావు నియామకం చేసినట్టు పాపిటి రాజు పత్రిక ప్రకటన లొ తెలిపారు ,నియమాక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజి గారు ,గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుసా ఉమామహేశ్వరరావు,రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యదర్శి రవికుమార్ పెనుమాక కలసి పాపిటి రాజు కి జిల్లా అధ్యక్ష నియామకం పత్రం అందించారు,ఈ సందర్భంగా పాపిటి రాజు మాట్లాడుతూ తనకి జిల్లా బాధ్యత ఇచ్చిన జిల్లా అధ్యక్షులు కి రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజి కి గిరిజన మోర్చా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు కి రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యదర్శి రవికుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు, పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని రాజు అన్నారు.

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలి

పాడేరు, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో మిచౌంగ్ తుఫాను కారణంగా అల్లూరి సీతారామరాజు వ్యాప్తంగా వరి, రాగి, మిరప, అరటి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని వెంటనే గిరిజన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చలించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కురుసా ఉమామహేశ్వరరావు, బీజేపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, పాడేరు మండలం లగిసిపల్లి పంచాయతీ ప్రాంతాల్లో నీట మునిగిన వరి పంటలను బుధవారం బీజేపీ నాయకులు వరి పొలాల్లో నీటి లో దిగి కోసిన వరి దుబ్బులు తో నిరసన తెలిపారు ,మూడు రోజులు పడిన వర్షాలుకు వరి కోతలు కోసిన వరి దుబ్బులు నీటిలో పూర్తిగా మునిగింది, కొన్ని చోట్ల వరి కుప్పలు కూడా మూడు అడుగుల మేర నీరు చేరడం వల్ల కుప్పలు కూడా 50/ శాతం పాడైపోయాయి అని స్థానిక రైతులు వాపోయారు, తమకు ఈ ఏడాది కరువు రావడం ఖాయం అని రైతులు దిగులు పడ్డారు బీజేపీ నాయకులు వర్డ, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే వరకు తాము అధికార పార్టీ పై పోరాటం చేస్తామని పాంగి రాజారావు అన్నారు,ప్రభుత్వం వెంటనే గిరిజన ప్రాంతాల్లో పర్యటన చేసి రైతులకు జరిగిన పంటల నష్టాన్ని బేషరతుగా పరిహారం ప్రకటించాలి అని వారు డిమాండ్ చేశారు, అల్లూరి జిల్లా లో ముంపు మండలాల కుడా పూర్తిగా వరి, మిరప, అరటి, పంటలు నష్టం వాటిల్లిందని వాటిని కూడా యుద్ధప్రాతి పదికన ప్రభుత్వ అధికారులు వెంటనే ఏరియల్ సర్వే నిర్వహించి నష్ట పరిహారం ప్రకటించాలి అని తాము కూడా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కూడా పంటలు ను పరిశీలించి ప్రభుత్వం కి నివేదిక ఇస్తామని తెల్పారు ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా రామకృష్ణ, బీజేపీ నాయకులు హేమ నాయక్, మినుములు గోపాల పాత్రుడు, కాకర చిన్నయ్య, రవి చంద్ర, అనతయ్య ,నవన్ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంట్ భవనము ఆవరణలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వద్ద నివాళులర్పించిన పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి
అనకాపల్లి, (విశాఖ సమాచారమ్)

ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు అడ్డంగా భారీ వృక్షం కూలింది విషయం తెలుసుకున్న తహశిల్దార్ ఆనంద్ పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు యుద్ధ ప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపడుతున్నారు.
అనకాపల్లి, (విశాఖ సమాచారమ్)

కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టు లలో గెస్ట్ లెక్చరర్స్ ను నియమించాలి

విజయనగరం: ఐ.టి.ఐ , డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీ గా ఉన్న లెక్చరర్స్ పోస్టు లలో గెస్ట్ లెక్చర్ల ను నియమించి తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రిన్సిపాల్స్ కు ఆదేశించారు. పోస్టుల ఖాళీల వలన ఏ సబ్జెక్టు లో కూడా ఉపాధ్యాయులు లేకుండా ఉండకూడదని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం నుండి మంజూరు కావలసిన పనులు , రావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలని తెలిపారు. అయితే స్థానికంగా ఏమేమి చేయగలమో అవన్నీ వెంటనే చేయాలని సూచించారు. ఇటీవల ఎస్. ఎఫ్. ఐ సంఘం నుండి జిల్లా వ్యాప్తం గా కళాశాలల్లో గుర్తించిన లోపాలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ విషయాన్ని దృష్టి లో పెట్టుకొని కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం జిల్లా కలెక్టర్ ఆయా కళాశాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ముఖ్యంగా కళాశాలల్లోని మౌలిక వసతులైనటువంటి తాగు నీరు, టాయిలెట్స్, విద్యుత్, ప్రహరీ గోడ , లెక్చరర్ పోస్టుల భర్తీ, వసతి గృహాల నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాల పై ఎస్.ఎఫ్.ఐ వారు వినతి పత్రాన్ని అందించారన్నారు. కళాశాల వారీగా కలెక్టర్ సమీక్షిస్తూ నాడు నేడు క్రింద మంజూరైన పనులన్నిటినీ త్వరగా పూర్తి చేయడం వలన అనేక సమస్యల పరిష్కారం జరుగుతుందని తెలిపారు. వెంటనే పనులుపూర్తి చేయడానికి ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త భవనాలు, అదనపు తరగతి గదులు పంట మంజూరు కోసం ప్రభుత్వానికి తన ద్వారా లేఖ రాయాల ని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల లో నాణ్యమైన ఆహారాన్ని అందించా లని, దీని పై ఆయా హెచ్.ఓ.డి లు నిరంతర పర్యవేక్షణ గావించాలని తెలిపారు. సరిగ్గా ఆహారాన్ని అందించని వారి పై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. అవకాశం ఉన్నంతవరకు అన్ని కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశం లో డి.ఈ.ఓ లింగేశ్వర రెడ్డి, జిల్లా బి.సి వెల్ఫేర్ అధికారి కె.సందీప్, డి.వి.ఈ.ఓ బీమ శంకర రావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్ర శేఖర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామానందం, ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపాల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాని పూలమాల వేసి నివాళులర్పించిన బుడుమూరి

ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): భారతరత్న, డా,బి ఆర్,అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, పేదగదిలి,జంక్షన్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి విశాఖ పార్లమెంట్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్, ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గాడీ సత్యం, వార్డు ఇంచార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి పాలరవు ,తురకపుడి బాలస్వామి,నల్ల ఈశ్వరరావు, పకిరు, పచ్చి పాల శ్రీను,దానాల ఈశ్వరరావు,భవిరేడు, రేఖా జ్యోతి,గొలుసు రమణ,దలితనాయకులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీటిని యుద్ధ ప్రాతి పదికన తొలగింపు చర్యలు

పాడేరు, (విశాఖ సమాచారమ్): పంట పొలాలల్లో ఉన్న నీటిని యుద్ధ ప్రాతి పదికన తొలగింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈనెల 9వ తేదీ నుండి తుఫాను నష్టాలపై ఎన్యూమరేషన్ చేపట్టాలన్నారు. జిల్లాలో పంట నష్టాలపై రైతులు ఆందోళన చెందవద్దని పంట నష్టాలపై ప్రభుత్వానికి నివేధించి నష్ట పరిహారం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. బుధవారం ఆయన చాంబరు నుండి వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులు, ఎంపిడిఓలు, తాహశిల్దారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరిగిన తుఫాను నష్టాలపై ఖచ్చితమైన నివేధికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, రోడ్డులు దెబ్బతింటే వెంటనే పునరుద్ధరణ పనులు చేయాలని సూచించారు. పునరుద్ధరణ పనులు చేయకపోతే ప్రమాదాలు, నష్టాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రచాబాకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఎంపిడిఓలు, తాహశిల్దారులు సచివా లయం సిబ్బంది సమన్వయంతో పను లు చేయాలన్నారు. ఇళ్లు, వ్యవసాయం, ఉద్యాన పంటలు, పశువుల నష్టంపై నివేధికలు సమర్పించాలని సూచించారు. మోటరు పంపులను అడ్డికు తీసుకుని నీటి నిల్వలు తొలగింపు చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధులు విడుదల చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్ మాట్లాడుతూ జిల్లాలో వరి పంటలు సుమారు 600 హెక్టార్ల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశామన్నారు. పత్తి 250 హెక్టార్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. రాజ్మా పంటలను నష్ట అంచనాలు వేస్తున్నామని అన్నారు.

జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు మాట్లాడుతూ దుంబ్రిగుడ, అరకు, అనంతగిరి మండలాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని వర్షాలు తగ్గిన తరువాత అంచనాలు తయారు చేస్తామని చెప్పారు. చింతూరు డివిజన్లో 50 ఎకరాల వరకు మిర్చి పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

ఈ టెలీ కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడి ఏ పి ఓ లు వి. అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులు, తాహశిల్దారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

మిగ్ జాం ప్రభావంతో యలమంచిలి విలవిల

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): యలమంచిలి పట్టణం,గ్రామీణంలో బుధవారం నాడుసెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఎమ్మార్వో ఎస్.రాణి అమ్మాజి తెలిపారు.గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా బుధవారం తెల్లవారుజామున నుంచి కురిసిన వర్షానికి రోడ్లపై వరద ఉప్పొంగ డంతో యలమంచిలి పట్టణ,మండల వ్యాప్తంగా పలు చోట్ల రాకపోకలు నిలిచిపోగా,జనావాసాలలో నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణ మున్సిపాలిటీలో లోతట్టు వార్డులలో డ్రైనేజీలో నుంచి మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో దుర్వాసన,దోమల వ్యాప్తితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా పరుసగా మూడో రోజు కూడా విద్యాసంస్థలకు యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి.

వరద నీటితో డ్రైనేజ పొంగి కొత్తపేట శివాలయం వీధి, మిలటరీ కాలనీలలో పబ్లిక్ డ్రైనేజల ద్వారా మురుగునీరు ఇళ్లలోకి ప్రవేశించింది.ఎప్పటి మాదిరిగానే మిలటరీ కాలనీ,నాగేంద్ర కాలనీ, కోపరేటివ్ బ్యాంకు వీధి, ఎల్ ఐ సి కార్యాలయం ఎదురుగా పాత జాతీయ రహదారి,జలాల వీధి,ఓరుగంటి వారి వీధి,గర్ల్స్ హై స్కూల్ రోడ్డు,ఎంపిడిఓ ఆఫీసు రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో పాదచారులు,వాహనదారులు రాకపోకలకి ఇబ్బంది ఏర్పడింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వెళ్లే స్థానిక పాతజాతీయ రహదారిపై నుంచి రేమ గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో ట్రాఫిక్ ని రేగుపాలెం మీద నుంచి యలమంచిలి పట్టణంలోకి మళ్ళించారు. రేమ గెడ్డ ఉధృతిని డిఎస్పి పి.శ్రీనివాసరావు, స్థానిక తాశిల్దార్ ఎస్.రాణిఅమ్మాజి,మున్సిపల్ వైర్ పర్సన్ పి.రమా కుమారి, ఎంపిపి బోడెపు గోవిందు పరిశీలించారు. పట్టణ ఎస్సై కె.పాపినాయుడు ఆధ్వర్యంలో గెడ్డ వద్ద గస్తీ నిర్వహించి అటుగా ఎవరూ వెళ్లకుండా స్థానికులను ఏర్పాటు చేశారు. తుఫానుతో మండలంలోని రేగుపాలెం గ్రామంలో లాలం సత్యవతి అనే మహిళ ఇంటి సన్ సైడ్ కూలడంతో గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి,ఆర్ ఐ విష్ణు, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

తుఫాను ప్రభావిత ప్రాంతంలో తక్షణ సహాయం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు తాసిల్దార్లు ఎంపీడీవోలతో వెబ్ ఎక్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు రేపు కూడా అప్రమత్తంగా ఉండాలని, సహాయ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారికి పరిస్థితిని వివరించి శిబిరాలకు చేర్చాలన్నారు. శిబిరాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు, నాణ్యమైన భోజనాలు అందాలన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు అయితే వెంటనే వైద్య శిబిరాలకు తరలించాలన్నారు. ప్రజలకు ధైర్యం చెప్పి పూర్తిగా వరద ప్రభావం తగ్గిన తరువాతే వారి ఇంటికి పంపించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గిన తర్వాత అందరికీ రేషన్ అందజేయాలని కార్డు లేకపోయినప్పటికీ రేషన్ అందించాలని ఆదేశించారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676